మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
గుంటూరు - శనివారం 19 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:113 | పేజీలు:8+4 | వెల: రూ.5
GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |

## 'రోహిత్ వేముల' చట్టం: రాహుల్ గాంధీ



6



## భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

**ఢిల్లీ, ఏప్రిల్ 18:** భగవద్గీత, నాట్య శాస్త్రానికి యునెస్కో గుర్తింపు లభించింది. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన విషయమని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చరిత్రాత్మక గుర్తింపు లభించింది. భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్ రిజిసర్‌లో చోటు లభించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీనిపై ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన విషయమని అన్నారు.

"భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు.. యునెస్కో రిజిస్టర్లో చోటు దక్కించుకున్నాయి" అని కేంద్రమంత్రి తన

...మిగతా 2లో

## గ్రీన్ కో ప్రాజెక్టును పరిశీలించిన కేంద్ర మంత్రి ప్రహల్లాద జోషి..

**అమరావతి:** ఓర్వకల్లు మండలం గని సమీపంలో ఉన్న సోలార్ పార్క్, గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్, విండ్ పవర్ ప్రాజెక్ట్ లను పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అప్పర్ ఇన్ టేక్ పాయింట్ రిజర్వాయర్ నుండి నీటిని పైపు ల ద్వారా టర్బైన్ ల వరకు సరఫరా చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, కర్నూల్ పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే చరిత వెంకటరెడ్డి వెంకటరెడ్డి తో పాటు గ్రీన్ కో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని ఇది కేంద్ర ప్రభుత్వ పని చేసే విధానమని తెలిపారు. ఈ ప్రాజెక్టు 60 సంవత్సరాలు పైగా పనిచేసే సామర్థ్యం కలదని ఈ ప్రాజెక్టు అతి త్వరలో పూర్తి సామర్థ్యంతో పనిచేస్తుందన్నారు.కేవలం సోలార్ విద్యుత్ పైనే ఆధారపడి ఉండకూడదని ప్రత్యామ్నాయంగా గాలి విద్యుత్తు, నీటి విద్యుత్తు ను వినియోగించుకొని అభివద్ధి చెందాలన్నారు. ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్‌లో 4,000 మెగా వాట్స్, సౌర, 1,000 మెగావాట్స్ పవన మరియు 1,680 మెగా వాట్స్ పంప్ చేయబడిన జలవిద్యుత్ ఉత్పత్తి ఉన్నాయని తెలిపారు. గ్రీన్ కో కంపెనీ హైడ్రోజన్ పవర్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టులపై పనిచేస్తున్నారని

...మిగతా 2లో





## చాలా రోజులైపోయింది చూసి.. నిద్ర పట్టడం లేదు

**నెల్లూరు:** పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో అదశ్యమైన వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆచూకీ తెలిపిన వారికి భారీ బహుమతి ఇస్తామని టీడీపీ సీనియర్ నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రకటించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆచూకీ చెబితే.. కరోనా ప్యాలెస్ బహుమతిగా ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం వెంకటాచలం మండలం రామదాసు కండ్రిగలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి.. తాను పెద్ద

...మిగతా 2లో

# బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం మోపుతాం

## మంత్రి నారా లోకేష్

**అమరావతి:** బెట్టింగ్ యాప్‌లపై ఏపీ మంత్రి నారా లోకేష్ స్పందించారు. బెట్టింగ్ యాప్‌ల వలన జీవితాలు నాశనం అవుతున్నాయని తనకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఎక్స్‌లో పెట్టిన ఒక పోస్టుపై లోకేష్ తీవ్రంగా రియాక్టయ్యారు. బెట్టింగ్ యాప్‌లపై రాష్ట్రంలో ఉక్కుపాదం మోపుతామన్న లోకేష్.. ఏపీలో బెట్టింపు యాప్‌ల నిషేదానికి సమగ్ర విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు. ఇది దేశానికే ఆదర్శంగా ఉండే విధానంగా ఉంటుందని చెప్పారు. న్యాయపరమైన అన్ని అవకాశాలను ఉపయోగించుకుని బెట్టింగ్ సంస్కతిని ఆపేందుకు ప్రయత్నం చేస్తున్నామని, బెట్టింగ్ యాప్‌ల వలన జీవితాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. అనేక మంది బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులై ఆర్థికంగా దెబ్బతింటున్నారని, ఇటువంటి పరిస్థితి నుంచి వారిని కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బెట్టింగ్ యాప్‌లలో జూదం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు."బెట్టింగ్ యాప్‌లు జీవితాలను నాశనం చేస్తున్నాయి. జూదానికి బానిసైన యువత నిరాశలోకి నెట్టబడుతున్నారని నేను వందలాది హృదయ విదారక ఘటనలు వింటున్నాను. ఇది ఆపాలి. దీర్ఘకాలిక పరిష్కారం ఏమిటంటే నిరంతర అవగాహన, ఇంకా.. బెట్టింగ్ యాప్‌లపై కఠినంగా వ్యవహరించడం. మొత్తం దేశానికే ఒక ఉదాహరణగా నిలిచే సమగ్ర బెట్టింగ్ వ్యతిరేక విధానంపై కషి చేస్తున్నాం.





## సోనియా, రాహుల్ ఇదే కేసులో బెయిల్‌పై ఉన్నారు..

**అమరావతి:** నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీల పేర్లు చేర్చడం బీజేపీ విద్వేషం అని దుష్ప్రచారం చేయడంపై రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు, ఎంపీ పురంధేశ్వరి మండిపడ్డారు. సోనియా, రాహుల్ ఇదే కేసులో బెయిల్‌పై ఉన్నారని పేర్కొన్నారు. శుక్రవారం వక్ఫ్ సంస్కరణల ప్రజా అవగాహన అభియాన్‌ను దగ్గుబాటి పురంధేశ్వరి ప్రారంభించారు. సవరణలు చేసి కొత్త చట్టాన్ని తీసుకురావడానికే అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మీడియాతో మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో లేనప్పుడు నమోదు అయిన కేసుపై బీజేపీపై బురద చల్లడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. అసోసియేటెడ్ జర్నల్స్

...మిగతా 2లో

## జిల్లాలో గాలివాన బీభత్సం...







**నంద్యాల:** జిల్లాలో గాలివాన బీభత్సం సష్టిస్తోంది. భారీ వర్షం కారణంగా రైతులు, ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలోని పాములపాడు, కొత్తపల్లి గడివేముల మండలాల్లో శుక్రవారం భారీ వర్షం, వడగళ్ల వాన కురిసింది. దీంతో చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. గడివేముల మండలం బిలకల గూడూరు గ్రామంలో పిడుగుపాటుకు ఒక చెట్టుతో పాటు వరి పంటలు పూర్తిగా కాలిపోయాయి.ఆత్మకూరు నుండి కర్నూలు వెళ్లే జాతీయ రహదారిపై చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీనితో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.జూటూరు, తుమ్మలూరు, పాములపాడు తదితర గ్రామాల్లో బలమైన గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లైన్ మెన్ లు, అధికారులు విద్యుత్ ఎరఫరాకు తక్షణ చర్యలు తీసుకున్నారు.కొత్తపల్లి మండల కేంద్రంలో వడగళ్ల వాన కురిసి పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తమ సమస్యలను పరిష్కరించడానికి ఆర్థిక సహాయం కోరుతున్నారు.


## రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలి: డిప్యూటీ స్పీకర్ రఘురామ

**గుంటూరు:** దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలని శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు ఆకాంక్షించారు. గుంటూరులోని లాంలో ఓ స్తిరాస్థి సంస్థ నూతన వెంచర్‌లో రతన్ టాటా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రతన్ టాటా కేవలం పారిశ్రామికవేత్త మాత్రమే కాదని.. గొప్ప మానవతావాది అన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఆయన చేసిన సేవలు నిరుపమానమని తెలిపారు. దేశానికి, ప్రజలకు రతన్‌టాటా చేసిన సేవలను ఎల్లవేళలా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని నాలుగేళ్ల క్రితమే ప్రధానికి లేఖ రాసినట్లు రఘురామ గుర్తుచేశారు. అవార్డు ఇచ్చినా,




లేకున్నా ఆయన భారతీయుల హదయాల్లో రత్నమేనని కొనియాడారు. ఎక్కడైనా వెంచర్లలో దేవుళ్ల విగ్రహాలు పెడతారని... ఇక్కడ మాత్రం రతన్ టాటా విగ్రహం పెట్టిన యాజమాన్యాన్ని రఘురామ అభినందించారు.

## బిగ్‌బాస్ ఎవరో కసిరెడ్డే చెప్పాలి: విజయ సాయిరెడ్డి



**విజయవాడః** వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి సిట్ విచారణ ముగిసింది. సిట్ బృందం దాదాపు 3 గంటల పాటు ఆయన్ని విచారించింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో జరిగిన రెండు సమావేశాల గురించి సిట్ అధికారులు తనను ప్రశ్నించినట్లు తెలిపారు. ఆ రెండు సమావేశాల్లో ఏం చర్చించారని, ఎవరెవరు పాల్గొన్నారని సిట్ అధికారులు

...మిగతా 2లో



## వారిద్దరే హీరోలు.. ఔరంగజేబు కాదు: రాజ్‌నాథ్ సింగ్

**ఛత్రపతి శంభాజీనగర్,ఏప్రిల్ 18:** మేవాడ్ పాలకుడు మహారాణా ప్రతాప్, ఛత్రపతి శివాజీ మహారాజ్.. ఇద్దరూ నిజమైన జాతీయ హీరోలని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. అంతేగానీ, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు కాదన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఏర్పాటు చేసిన మహా రాణాప్రతాప్ విగ్రహాన్ని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ధైర్యం, దేశభక్తికి మహారాణా ప్రతాప్ ప్రతిరూపమన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ గెరిల్లా యుద్ధ వ్యూహాలకు మహారాణా ప్రతాప్ నుంచే ప్రేరణ పొందారని తెలిపారు.భారత స్వాతంత్ర్యానంతరం చరిత్రకారులు రాణా ప్రతాప్, శివాజీ మహారాజ్‌కు తగినంత గుర్తింపు ఇవ్వలేదని రాజ్‌నాథ్ సింగ్ ఈ

...మిగతా 2లో



## టాటా సంస్థకు భూముల కేటాయింపుపై వైకాపా తప్పుడు ప్రచారం: శ్రీభరత్

**విశాఖపట్నం:** టాటా సంస్థకు భూముల కేటాయింపుపై వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని విశాఖ ఎంపీ శ్రీభరత్ మండిపడ్డారు. వైకాపా నేతల వ్యాఖ్యలను ఖండించారు. దేశంలో పేరున్న, నమ్మకమైన టాటా వంటి కంపెనీ రాష్ట్రానికి వస్తే.. దానిని చూసి మరిన్ని


...మిగతా 2లో

## జగన్ విద్వేషాలు రెచ్చగొడుతున్నారు: నిమ్మల రామానాయుడు

**పాలకొల్లు:** మరోసారి అధికారం కోసం జగన్ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాద ఘటనపై దుష్ప్రచారం చేసి.. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని అన్నారు. వక్ఫ్ బిల్లుపై వైకాపా ద్వంద్వ వైఖరి దేశవ్యాప్తంగా అందరికీ తెలిసిందని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో శుక్రవారం మంత్రి నిమ్మల పర్యటించారు. పోడూరులో రూ.2.62 కోట్లతో పంటకాల్వల వద్ద రోడ్డుకు శంకుస్థాపన

...మిగతా 2లో

## నెల వ్యవధిలోనే.. 1000 మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు!



**వాషింగ్టన్, ఏప్రిల్ 18:** గడిచిన కొన్ని వారాల్లోనే 1000 మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను అమెరికా రద్దు చేసినట్లు సమాచారం.

అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్. విదేశీ విద్యార్థులపైనా ఉక్కుపాదం మోపుతున్నారు. గడిచిన కొన్ని వారాల్లోనే 1000 మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను రద్దు చేసినట్లు సమాచారం. దీంతో ట్రంప్ యంత్రాంగం తీరుపై అనేక మంది విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. వీసా రద్దు చేసే క్రమంలో ఫెడరల్ ప్రభుత్వం సరైన రీతిలో వ్యవహరించడం లేదని వాదిస్తున్నారు.

వీసాలను రద్దు చేస్తూ ఫెడరల్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వందలాది విదేశీ విద్యార్థులకు నిర్బంధం, డిపోర్టేషన్ ముప్పు పొంచి ఉంది. హార్వర్డ్, స్టాన్ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్, ఒహాయో స్టేట్ యూనివర్సిటీ సహా కొన్ని చిన్న కాలేజీల విద్యార్థులు ఈ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. మొత్తంగా మార్చి చివరి వారం నుంచి ఇప్పటివరకు 160 కాలేజీల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. కనీసం 1024 మంది విద్యార్థుల వీసాలు రద్దు అయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ అంచనా వేసింది. ఇదే సమయంలో

...మిగతా 2లో

## 50 శాతం భారతీయ విద్యార్థులే



**ఢిల్లీ, ఏప్రిల్ 18:** అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవేనని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.ఈ మేరకు 327 వీసా రద్దు కేసులు తమకు అందినట్లు అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ తాజాగా ప్రకటన జారీ చేసింది. ఈ విషయంపై

...మిగతా 2లో

# గ్రీన్ కో ప్రాజెక్టును పరిశీలించిన కేంద్ర మంత్రి ప్రహల్లాద జోషి..

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని 20 రాష్ట్రాలలో వీరు వీటిని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.ఈ విధంగా దేశాభివద్ధికి కషి చేస్తున్న గ్రీన్ కో మేనేజింగ్ డైరెక్టర్ చలమల శెట్టి అనిల్ కుమార్ కు శుభాకాంక్షలు అభినందలు తెలియజేశారు.

విలేకరుల సమావేశంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, చిక్బల్లాపూర్ ఎంపీ జి.సుధాకర్ రెడ్డి, గ్రీన్ కో మేనేజింగ్ డైరెక్టర్ చలమల శెట్టి అనిల్ కుమార్, కర్నూల్ ఆర్డీఓ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..గ్రీన్ కో సంస్థ ఎండి చలమలశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. వేగంగా అభివద్ధి చెందుతున్న ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత, ఈ ప్రాంతంలో ఆర్థిక వద్ధిని పెంచుతుందని, అనుబంధ పరిశ్రమల అభివద్ధిని ప్రోత్సహిస్తుందని అదే విధంగా ఉపాధి అవకాశాలను సష్టిస్తుందని తెలిపారు.

స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి, నిల్వ డిమాండ్‌పై సరఫరా కోసం రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్ భారతదేశ ఇంధన భద్రతను పెంచడంలో, పర్యావరణ అనుకూల వనరులకు పరివర్తనను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రీన్ కో సంస్థ ప్రతినిధులతో పాటు కర్నూలు బిజెపి జిల్లా ఇన్చార్జి అంకాల రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సోనియా, రాహుల్ ఇదే కేసులో బెయిల్‌పై ఉన్నారు..

(మొదటి పేజీ తరువాయి)

లిమిటెడ్‌లో 5 వేల మంది స్వాతంత్ర్య సమరయోధులు పెట్టుబడి పెట్టారని, 1057 మంది స్వాతంత్ర్య సమరయోధులు మాత్రమే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌లో మిగిలారని పురందేశ్వరి పేర్కొన్నారు. వడ్డీ లేని రూ. 90 కోట్ల రుణాన్ని అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌కు కాంగ్రెస్ ఇచ్చిందన్నారు. యంగ్ ఇండియా అనే కంపెనీని రూ. 5 లక్షల పెట్టుబడితో పెట్టారని.. ఇందులో 76 శాతం వాటా సోనియా, రాహుల్‌దేనని అన్నారు. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ అప్పులు తీర్చేస్తామని చెప్పి కంపెనీ సహా ఆస్తులను సైతం యంగ్ ఇండియా తీసుకుందన్నారు. 2012లో సుబ్రహ్మణ్యస్వామి కాంగ్రెస్ పార్టీ అప్పు ఇవ్వడం, వాటాదారులు 1050 మందికి చెప్పకుండా ఎలా చేస్తారనే అంశంపై కోర్టుకు వెళ్ళారని పురందేశ్వరి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది బీజేపీ ప్రమేయం లేని అంశమని.. సుబ్రహ్మణ్య స్వామి కేసు వేసే నాటికి బీజేపీ అధికారంలో లేదని అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఈ కేసు తీసుకుని అన్ని వివరాలతో సహా ఛార్జిషీటు వేసిందని పురందేశ్వరి పేర్కొన్నారు.

వక్ఫ్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై వస్తున్న వాదనలపై పురందేశ్వరి క్లారిటీ ఇచ్చారు. ఈ చట్టంలో ధర్మాసనం జోక్యం చేసుకోవడం లేదని అంటూనే గుర్తించబడిన వక్ఫ్ ఆస్తులలో మార్పులు చేయవద్దని సుప్రీంకోర్టు పేర్కొందన్నారు. కొత్త బోర్డు ఏర్పాటు చేసేప్పుడు కొత్త చట్టం ప్రకారం జరగాలని.. ఇప్పుడున్న వక్ఫ్ బోర్డు విషయంలో తలదూర్చడ లేదని న్యాయస్థానం పేర్కొందన్నారు. వక్ఫ్ ధార్మిక వ్యవస్థ వక్ఫ్ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదని పురందేశ్వరి స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు విషయంలో సవరణలు చేస్తే విపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం చెప్పిన విషయాలు, కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదీ ఒక్కటేనని అన్నారు. వక్ఫ్ విషయంలో బీజేపీ పీపీటీని ఈ సందర్భంగా పురందేశ్వరి ప్రదర్శించారు.



# బిగ్‌బాస్ ఎవరో కసిరెడ్డే చెప్పాలి: విజయ సాయిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

అడిగారన్నారు. మొదటి సమావేశం హైదరాబాద్లో జరిగిందని, విజయవాడలో జరిగిన రెండో సమావేశంలో లిక్కర్ పాలసీపై చర్చించామని సిట్ అధికారులకు చెప్పానన్నారు. కిక్బ్యాక్స్ గురించి అడిగారు. నాకు తెలియదని చెప్పాను. రాజ్ కసిరెడ్డి వసూలు చేసిన డబ్బులు ఎవరికి వెళ్లాయో నాకు తెలియదు.



ఎవరికైనా సిఫారసు చేశారా? అని అడిగారు. రెండు కంపెనీలకు సిఫారసు చేశానని చెప్పాను. ఒకరికి రూ.60 కోట్లు, మరొకరికి రూ.40 కోట్లు ఇచ్చారని చెప్పా. రుణం మాత్రమే ఇప్పించాను. నిధుల వినియోగం గురించి తెలియదని చెప్పాను. మద్యం అమ్మకాల విషయంలో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశాను. అన్ని ప్రశ్నలకూ రాజ్ కసిరెడ్డే సరైన జవాబులు చెప్తాడని చెప్పా. మొత్తం నాలుగు ప్రశ్నలు అడిగారు. నా సమాధానాలతో తృప్తి చెందారని భావిస్తున్నా. మరోసారి పిలిచినా వస్తానని సిట్ అధికారులకు చెప్పాను. రాజ్ కసిరెడ్డిని ప్రశ్నిస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయి జగన్ పక్కనున్న కోటరీ నాపై లేనిపోనివి చెప్పి ఆయన మనసు మార్చింది. కోటరీ వేధింపులు తాళలేక అనేక ఇబ్బందులు పడ్డా. నా నెంబర్-2 స్థానం రెండువేల స్థానానికి పడిపోయింది. వ్యవసాయం చేసుకుంటానన్న వ్యక్తికి రాజకీయాలు ఎందుకని అంటున్నారు. నేను ఎప్పుడూ ఎంపీ కావాలని అడగలేదు. రాజకీయాల్లోకి మళ్లీ రావాలంటే ఇతరుల అనుమతి అవసరం లేదు. ప్రజలు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మళ్లీ రీ ఎంట్రీ ఇస్తా. వారి న్యూస్ ఛానల్లో నాపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. మద్యం స్కామ్లో బిగ్బాస్ ఎవరో రాజ్ కసిరెడ్డిని అడగాలి'' అని విజయసాయిరెడ్డి అన్నారు.

# చాలా రోజులైపోయింది చూసి.. నిద్ర పట్టడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

పుడింగినంటూ తొడలు కొట్టి .. ప్రస్తుతం భయంతో పిరికిపందలా పారిపోయాడని వ్యంగ్యంగా అన్నారు.

**కరోనా ప్యాలెస్ గిఫ్ట్..**

మొన్నటి దాకా కేసులకు అదరను, బెదరనని తొడగొట్టాడు.. ఇప్పుడేమో అడ్రస్ లేకుండా పోయాడని విమర్శించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆచూకీ చెప్పిన వారికి కరోనా ప్యాలెస్ గిఫ్ట్‌గా ఇచ్చేద్దామనుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ఆఫర్ వైసీపీ వాళ్లకు సైతం వర్తిస్తుందన్నారు. ఎవరైనా ముందుకు వచ్చి చెప్పండంటూ ఆ పార్టీ వాళ్లకు ఈ ఆఫర్ చేశారు.

**పెద్ద పుడింగినని పెట్రేగిపోయాడు..**

నెల్లూరులో పెద్ద పుడింగినని పెట్రేగిపోయాడని.. పోలీసుల దుస్తులూడదీస్తానని మాట్లాడాడన్నారు. కానీ ఇప్పుడు భయంతో వణికిపోతూ పిరికిపందలా పారిపోయాడని గుర్తు చేశారు. అంత భయపడే పిరికి పంద తొడలు కొట్టడమెందుకో అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. 2016లో నకిలీ పత్రాలు తయారు చేసి రాత్రికి రాత్రే లుంగీ మీదే ఉడాయించాడంటూ ఎద్దేవా చేశారు.

రెండు నెలలు కనిపించ లేదని గుర్తు చేశారు. చివరకు సుప్రీంకోర్టులో కండీషన్ బెయిల్ పొంది.. రెండు నెలలపాటు ప్రతి రోజూ కానిస్టేబుల్ వద్ద కాకాణి గోవర్ధన్ రెడ్డి సంతకం పెట్టి వచ్చాడన్నారు. సిగ్గు,శరం లేకుండా వైసీపీ అధికారంలోకి రాగానే మళ్లీ అరాచకాలు, అక్రమాలు, దోపిడీలతో చెలరేగిపోయాడంటూ కాకాణి వ్యవహార శైలిపై ఆయన మండిపడ్డారు. అవి కాకుండా మళ్లీ తమపై అక్రమ కేసులు బనాయించాడు... కాకాణి వాడిన భాష అత్యంత దారుణమన్నారు.

**కిరణ్‌ను..**

అయితే ఇటీవల కిరణ్ అనే వ్యక్తి.. జగన్ రెడ్డి కుటుంబ సభ్యులను అసభ్యంగా మాట్లాడితే తమ ప్రభుత్వం ఉపేక్షించ లేదని గుర్తు చేశారు. అతడిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెట్టి జైల్లో సైతం పెట్టించామని ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు.

**అలా అయితే.. జగన్‌కు నాలుగు సీట్లు పెరిగేవి..**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డికి కొంచెమైనా మానవత్వం ఉండి ఉంటే వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్ రెడ్డి లాంటి వాళ్లు నోటికొచ్చినట్టు మాట్లాడినప్పుడే ఆ పని చేయాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. కుటుంబ సభ్యులను, తల్లిదండ్రులను దూషించే వారిపై అప్పట్లోనే చర్యలు తీసుకుని ఉంటే జగన్ రెడ్డికి మరో నాలుగు ఎమ్మెల్యే సీట్లయినా పెరిగి ఉండేవని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**వెకిలి నవ్వులు నవ్వాడు..**

అధికారంలో ఉన్నప్పుడు పనికి మాలిన గుణాలు ఉండే వారందరినీ వెనకేసుకొచ్చి వెకిలి నవ్వులు నవ్వాడు..ఇప్పుడు జైల్లో ఉండే వారిని పరామర్శిస్తూ వాళ్లు అందంగా ఉన్నారని.. వాళ్లకి బాడీలు భలే ఉన్నాయని.. పోలీసుల దుస్తులు ఊడదీస్తానని మాట్లాడుతున్నాడంటూ వైఎస్ జగన్ వ్యాఖ్యలను ఎద్దేవా చేశారు. ఒక సీఎం స్థానంలో పని చేసిన వ్యక్తిలా కాకుండా జగన్ రెడ్డి ఇంత దిగజారిపోతాడని తాము మాత్రం అనుకోలేదన్నారు. అలాగే మంత్రులుగా పని చేసిన వారు ఇలా పిరికిపందల్లా పారిపోతారని కూడా మేం ఊహించ లేదని చెప్పారు.

**చూసి చాలా రోజులైపోయింది..**

ఇంతకీ కాకాణి ఏ కలుగులో దాక్కున్నాడో.. ఆయనను చూసి చాలా రోజులైపోయిందంటూ ఆయన వ్యంగ్యగా అన్నారు. నిత్యం తనను తిడుతూ గడిపే వాడు...ఉదయం లేచినప్పటి నుంచి దడదడమంటూ నోటికొచ్చినట్టు తిట్టేవాడు.. అలాంటి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇన్ని రోజులు తనను తిట్టకుండా ఆయనకు రోజు ఎలా గడుస్తుందో అంటూ వ్యంగ్యంగా అన్నారు. కాకాణి తిట్టక పోయే సరికి తనకు నిద్రపట్టడం లేదని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

# టాటా సంస్థకు భూముల కేటాయింపుపై వైకాపా తప్పుడు ప్రచారం: శ్రీభరత్

(మొదటి పేజీ తరువాయి)

కంపెనీలు వస్తాయన్నారు. సమాజంలో మంచి పేరున్న కంపెనీని ఆహ్వానిస్తే.. అనుకున్న దానికంటే ఎక్కువ పెట్టుబడులు, ఎక్కువ ఉద్యోగాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. టాటా సంస్థను విమర్శించేంత స్థాయి వైకాపాకి లేదని, ఎప్పటికీ రాదని తెలిపారు.

# జగన్ విద్వేషాలు రెచ్చగొడుతున్నారు: నిమ్మల రామానాయుడు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ '' పార్లమెంట్ చరిత్రలో ఓటింగ్ అయ్యాక విప్ జారీ చేసిన ఘనత జగన్‌దే. నాస్తికుడిని తితిదే ఛైర్మన్‌గా నియమించడం జగన్ చేసిన తప్పు. ఆయనకు చెందిన రూ.800 కోట్ల విలువైన షేర్లను ఈడీ సీజ్ చేసింది. దేశంలోని విచారణ సంస్థలన్నీ ఆయన్ని వేలెత్తి చూపుతున్నాయి'' అని పేర్కొన్నారు.

# కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాజాసింగ్ డుమ్మా

**హైదరాబాద్**, మనం ప్రతినిధిః తెలంగాణలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్తున్న కషాయ పార్టీకి.. గడ్డు పరిస్థితులు ఉన్నట్లు కనిపిస్తోంది.. పార్టీలో ేతల తీరు చూస్తుంటే... సీనియర్లు వర్సెస్ జూనియర్లు, పాత, కొత్త నేతల నడుమ ఏదో జరుగుతున్నట్లు కనిపిస్తోంది. తమని కాదని ముందుకు వెళ్లేవారిని కొందరి సీనియర్ నేతలు తొక్కుతున్నారని, కుట్రలు చేస్తున్నారని మాటల యుద్ధం నడుస్తోంది. గత కొద్ది రోజుల నుంచి బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి, ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మధ్య దూరం పెరుగుతున్నట్టే కనిపిస్తోంది. ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజాసింగ్‌ను కలిసి బుజ్జగించారు. కొలిక్కి వచ్చిందనుకున్న వ్యవహారం.. తాజాగా బీజేపీలో అసంతృప్తి మరోసారి బయటపడింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికపై శుక్రవారంనాడు జరిగిన సమావేశానికి రాజాసింగ్ డుమ్మా కొట్టారు. హైదరాబాద్‌లో బీజేపీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే ఈ సమావేశానికి గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులుగా కిషన్ రెడ్డికి, రాజాసింగ్ మధ్య విభేదాలు కొనసాగుతున్నట్టు పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. అన్ని కులాలు, వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ బీజేపీ అని... కానీ, పార్టీ రాష్ట్ర నాయకత్వం కేవలం ఒక వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చేలా రాజకీయాలు చేస్తోందని రాజాసింగ్ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

# ఔరంగజేబు కాదు: రాజ్‌నాథ్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా విమర్శించారు. ఔరంగజేబును మాత్రం ప్రశంసించారని పేర్కొన్నారు. ఔరంగజేబును హీరోగా భావించేవారు అతడి క్రూరత్వం, ఛాందసవాదంపై పండిట్ జవహర్లాల్ నెహ్రూ రాసిన పుస్తకం చదివాలని సూచించారు. మహారాణా ప్రతాప్ తన ఆత్మగౌరవం కోసం తన జీవితాన్నే త్యాగం చేశారని కొనియాడారు. అక్బర్ ఆధిపత్యాన్ని సవాల్ చేశారని.. అన్నివర్గాల ప్రజలను ఏకం చేసి తన ధైర్యసాహసాలకు మారుపేరుగా నిలిచారన్నారు.

ఆదివాసీలు, ముస్లింలు ఆయన సైన్యంలో భాగంగా ఉండేవారని.. హకీం ఖాన్ సూరి మొఘలులతో పోరాడి హల్దీఘాటీ యుద్ధంలో తన ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు.

# ఆ 10 మంది ఎలా పెరిగారు?

- గ్రూప్-1 పరీక్షల ఫలితాలు వచ్చేసరికి 10 మంది ఎలా పెరిగారు?: రాకేశ్ రెడ్డి
- హైకోర్టు తీర్పు పోరాడిన అభ్యర్థుల విజయం : రాకేశ్ రెడ్డి

**హైదరాబాద్**, మనం ప్రతినిధిః గ్రూప్-1 పరీక్ష ఫలితాలలో ఆ 10 మంది అభ్యర్థులు ఎలా పెరిగారని బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు. ఈ పరీక్షలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు టీజీపీఎస్సీకి చెంపపెట్టులాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. ధర్మానిదే అంతిమ విజయమని హైకోర్టు తీర్పు ద్వారా స్పష్టమైందని ఆయన అన్నారు. హైకోర్టు తీర్పు... పోరాడిన అభ్యర్థుల విజయమని, వారికి అండగా నిలిచిన బీఆర్ఎస్‌కు నైతిక విజయమని ఆయన పేర్కొన్నారు. మెయిన్‌కు 21,075 మంది హాజరు కాగా, ఫలితాలు ప్రకటించే సమయానికి 21,085 మంది అభ్యర్థులు ఉన్నారని... మరి ఈ అభ్యర్థుల సంఖ్య ఎలా పెరిగిందో చెప్పాలని టీజీపీఎస్సీని రాకేశ్‌రెడ్డి నిలదీశారు.

ఇది సైబర్ నేరమా? అని రాకేశ్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. లేక, ఒక పద్ధతి ప్రకారం మార్కులు వేసినట్లు కనిపిస్తోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో 21 ఉల్లంఘనలు జరిగాయని ఆరోపించారు. దీనిపై న్యాయ విచారణ లేదా సీబీఐతో విచారణ జరిపించాలని రాకేశ్‌రెడ్డి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# పారిశ్రామిక వాడగా మడకశిర..

## కూటమి ప్రభుత్వ మంత్రుల వెల్లడి

**విరివిగా విండ్ విద్యుత్ కేంద్రాలు**

**ఇప్పటికే యుద్ధ మందుగుండు సామగ్రి తయారీ సంస్థ**

**పరిశ్రమలకు నిరంతర, రైతులకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా**



**గుంటూరు:** శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర ప్రాంతాన్ని పారిశ్రామికవాడగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పలువురు మంత్రులు పేర్కొన్నారు. కోస్తా ప్రాంతానికి దీటుగా శ్రీ సత్యసాయి జిల్లా నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం పెంచే విధంగా కషి చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పలు పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకారంతో కషి చేస్తున్నామన్నారు. శుక్రవారం మడకశిరలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవం కార్యక్రమానికి విచ్చేసి మాట్లాడారు.

ముఖ్యంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగానే సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో 2019- 24 వరకు అధికారంలో ఉన్న వైకాపా పాలన వలన అన్ని విధాలుగా నష్టం జరిగిందన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక అభివద్ధి అనేది లేకుండా పోయిందన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చి, అనంతరం తిరిగి వెనక్కు వెళ్లిన సంగతిని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. అయితే 2024 ఎన్నికలలో విజయం సాధించి, రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అధినేతగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో పారిశ్రామిక అభివద్ధి తిరిగి గాడిన పెట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం అనేక పరిశ్రమల ఏర్పాటుకు ఆయా సంస్థలు ముందుకు రావడమే నిదర్శనం అన్నారు.

ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో మడకశిర ప్రాంతంలో యుద్ధ మందుగుండు సామాగ్రి అనగా తుపాకుల లో వాడే మందును తయారుచేసే పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా 2000 మెగావాట్ల విండ్ విద్యుత్ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు పలు సంస్థలను ఆహ్వానించడం జరిగింది అన్నారు. ఇందుకు సంబంధించి నవయుగ సంస్థను సంప్రదించి చర్చించడం జరిగిందన్నారు. కాగా ఇప్పటికే జిల్లాలో ఈహెచ్ టి సబ్ స్టేషన్ లో 18, 33/11 సబ్ స్టేషన్ 145, 33 కెవి లీడర్స్ 121, 11 కెవి అగ్రికల్చరల్ ఫీడర్స్ 396, డిటిఆర్ఎస్ 89,942, సుమారు ఒక లక్ష 43 వేల ఎనిమిది వందల తొంబై ఆరు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం పనిచేయడం ప్రారంభించామన్నారు. ఇంకా శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి, హిందూపురం ధర్మవరం పెనుకొండ రాప్తాడు మడకశిర నియోజకవర్గం 11 కొత్త 33/11 కె.వి సబ్ స్టేషన్ల వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు.

ఇంకా అదనపు పవర్ ట్రాన్స్ఫార్మర్ కూడా చేపడుతున్నాం. 2024 25 సంవత్సరంలో 715 డిటిఆర్ఎస్ ఎరెక్ట్ చేశామన్నారు. ఆర్డీఎస్ఎస్ కింద ఓవర్ లోడ్ 33 కెవి లీడర్ బైబర్కేషన్, సగ్రేషన్ ఆఫ్ 11 కెవి ఫీడర్స్ పనులు చేస్తున్నామన్నారు. కాగా ఆర్డీఎస్ఎస్ 2 కింద 33/11 కెవి సబ్ స్టేషన్ 155 ప్రపోజ్ చేశామన్నారు. లి65 వేల గ్రూప్ టాకింగ్ సోలార్ కనెక్షన్లు%ొ% ఇదిలా ఉండగా 65 వేల రూఫ్ టాప్ సోలార్ కనెక్షన్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము అన్నారు. పీఎం కోసం కింద ఈ జిల్లాలో 23 సబ్ స్టేషన్ లో పరిధిలో లీడర్ లెవెల్ సోలార్జేషన్ చేపడుతున్నామని మంత్రులు తెలిపారు. సమావేశంలో హిందూపురం ఎంపీ పార్థసారథి, మడచర్ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


# భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

పోస్ట్‌లో వెల్లడించారు. దీనిపై ప్రధాని మోడీ స్పందిస్తూ ''ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీత, నాట్యశాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడం.. మన జ్ఞాన సంపద, సంస్క ృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి శతాబ్దాలుగా మన నాగరికత, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తిని స్తూనే ఉన్నాయి'' అని సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధరంగం లో సోదరులు, గురువులు, బంధు జనులందరినీ చూసి ధనుర్బాణాలు విడిచి చతికిల పడిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ- భగవద్గీత. మనుషులు ప్రవర్తించవలసిన తీరు, పారలౌకికాన్ని పొందే తెన్నూ రెండింటినీ శ్రీకృష్ణుడు బోధించాడు.

# నెల వ్యవధిలోనే.. 1000 మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు!

(మొదటి పేజీ తరువాయి)



డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ చర్యలకు వ్యతిరేకంగా కోర్టుల్లో దావాలు వేస్తున్న విద్యార్థులు.. తమ వీసా రద్దు చేయడానికి ప్రభుత్వం వద్ద ఎటువంటి సమర్థనీయ అంశాలు లేవని వాదిస్తున్నారు.

**ఎందుకు రద్దు చేస్తున్నారు?**

వీసా రద్దుకు అనేక కారణాలు చూపెడుతున్నప్పటికీ.. చిన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయని గుర్తించినట్లు కాలేజీలు పేర్కొంటున్నాయి. మరికొన్ని కేసుల్లో మాత్రం విద్యార్థులను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే విషయంపై స్పష్టత లేదు. ''ఈ వీసాలను రద్దు చేస్తున్న సందర్భం, విధానం చూస్తుంటే.. దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో విద్యార్థి వీసాలను రద్దు చేసే విధానాన్ని డీహెచ్ఎస్ అవలంబిస్తుందనే ప్రశ్న తలెత్తుతోంది'' అని మిషిగాన్ యూనివర్సిటీ తరఫున వాదిస్తున్న లాయర్లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు.

**వీసా రద్దైతే..?**

విద్యార్థి వీసా రద్దైతే.. ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించే ప్రమాదం ఉంది. అందుకే అరెస్టుకు భయపడిన కొందరు విద్యార్థులు చదువులు పూర్తి చేయకుండానే దేశం విడిచి వెళ్తున్నట్లు సమాచారం. ఇలా వీసా రద్దు, అరెస్టు చేయడం వంటి చర్యలు.. విదేశీ విద్యార్థులను అమెరికా చదువుల పట్ల నిరుత్సాహానికి గురిచేస్తాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 50 శాతం భారతీయ విద్యార్థులే

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవేనని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర విదేశాం గశాఖ మంత్రి జై శంకర్ అమెరికా దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్‌కు అందిన నివేదికల ప్రకారం ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50శాతం భారతీయులు ఉన్నారని.. అయితే వారి వీసా రద్దుకు సరైన కారణాలు పేర్కొనలేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నివేదిక ప్రకారం.. వీసాలు రద్దు చేసిన విద్యార్థుల్లో 50శాతం మంది భారత్‌కు చెందినవారు కాగా 14శాతం మంది చైనా దేశీయులు. తర్వాతి స్థానాల్లో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు ఉన్నారు. దీనిపై ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ మాట్లాడుతూ.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ , ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంతర్జాతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొంది. ఈవిషయంపై భారత విదేశాంగ శాఖ నుంచి ఎటువంటి స్పందన లేదు. చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. విదేశాంగ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో చదువులు కొనసాగించలేకపోతున్నామని.. తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా నిరసన కార్యక్రమాలలో పాల్గొనని వారి వీసాలు కూడా రద్దయినట్లు కళాశాలలు పేర్కొంటున్నాయి. వీసాల రద్దుకు అధికారులు సరైన కారణాలు కూడా తెలియజేయట్లేదని విద్యార్థులు వాపోయారు.


# ఓర్వకల్లు గ్రీన్ కో ప్రాజెక్టు పరిశీలన



**కర్నూలు ఏప్రిల్ 18మనం న్యూస్:** ఓర్వకల్లు మండలం గని సమీపంలో ఉన్న సోలార్ పార్క్, గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్, విండ్ పవర్ ప్రాజెక్ట్ లను హెలికాప్టర్ ద్వారా పరిశీలించిన అనంతరం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అప్పర్ ఇన్ టేక్ పాయింట్ రిజర్వాయర్ నుండి నీటిని పైపు ల ద్వారా ట్బన్ ల వరకు సరఫరా చేసే విధానాన్ని పరిశీలించారు.. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు పాణ్యం ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరిత వెంకటరెడ్డి వెంకటరెడ్డి తో పాటు గ్రీన్ కో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ గ్రీన్కో ఇంటిగ్రేటెడ్ రెమాట్లాడుతూఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్ట్ యొక్క వేగవంతమైన పురోగతిని ప్రశంసించారు.ప్రపంచంలోనే మొట్టమొదటి మరియు అతిపెద్ద రకమైన ప్రాజెక్ట్ గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ మన దేశంలో ఉండడం గర్వకారణం అన్నారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వంలో భారతదేశం యొక్క గ్రీన్ ఎనర్జీ సామర్థ్యానికి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ అన్నారు.. ఈ మార్గదర్శక ప్రయత్నాన్ని సాధ్యం చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను అన్నారు. గ్రీన్ కో సంస్థ ఎండి చలమలశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత, ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధిని పెంచుతుందని, అనుబంధ పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని అదే విధంగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు.. స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి, నిల్వ మరియు డిమాండ్ సరఫరా కోసం రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్ భారతదేశ ఇంధన భద్రతను పెంచడంలో మరియు పర్యావరణ అనుకూల వనరులకు పరివర్తనను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ కో సంస్థ ఎండి చలమలశెట్టి అనిల్ కుమార్, కర్నూలు బిజెపి జిల్లా ఇన్చార్జి అంకాల రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# తమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు

- **బదినెహాల్ లక్ష్మిరెడ్డి**






**కౌతాళం, ఏప్రిల్ 19(మనం న్యూస్):** రావు సాహెబ్ బదినేహాళ్ తమ్మిరెడ్డి వారి సత్రం కమిటీ సౌజన్యంతో మండల గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆసక్తి గలవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని బదినెహాల్ లక్ష్మిరెడ్డి మరియు పద్మావతమ్మ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఆదోనిలో రావు సాహెబ్ బాధినేహాల్ తమ్మిరెడ్డి వారి సత్రం భవనం పెద్ద పోస్ట్ ఆఫీస్ ముందు ఉచిత కంటి పరీక్షలు ఆపరేషన్ మరియు గుండె,కిడ్నీ వైద్య పరీక్షలు ఏప్రిల్ 30 వ తేదీన ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ఆధార్ కార్డు. ఆరోగ్యశ్రీ కార్డు, తెల్ల రేషన్ కార్డు,రెండు పాస్పోర్ట్ ఫోటోలు,మరియు వారి దగ్గర ఉన్న సెల్ ఫోన్ నెంబర్ కాంటాక్ట్ నెంబర్ ఏప్రిల్ 28,,29 లోపల నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ వైద్య శిబిరంలో ఉచిత కిడ్నీ వైద్య పరీక్షలు బీపీ,షుగర్, సిబిపి, సి యు సి,ఉచితంగా గుండె పరీక్షలు ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ, టుడి ఎకో,టిఎంటి, గల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే వైద్య నిపుణులచే ఉచితంగా కంటి పరీక్షలు చేయబడును కంటి ఆపరేషన్లు అవసరమైనచో వారికి అత్యాధునికమైన లెన్స్ కూడా ఉచితంగా అమర్చబడును శిబిరంలో కంటి ఆపరేషన్ అవసరమైన వారికి అదే రోజు నంద్యాలలో తీసుకెళ్లి శాంతిరం హాస్పిటల్ నందు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయబడును ఆ ప్రశ్న కొరకు వెళ్లిన వారికి నంద్యాలలో భోజనము వసతి ఇతర సౌకర్యములు ఉచితంగా కల్పించబడును. అని పేర్కొన్నారు.. ఆప్తో మెట్రిస్ట్ శాంతిరాం ఆస్పత్రి నంద్యాల సిబ్బంది.. 9980269622.. .06361707972 ..09916665347 ఈ నెంబర్ల తో పాటు విశ్వనాథ్ రెడ్డి 9849679001 కు సంప్రదించాలని కోరారు.

# వర్షపు నీరు నిలవకుండా చర్యలు



**కర్నూలు, ఏప్రిల్ 18(మనం న్యూస్):** నగరంలోని అశోక్ నగర్ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కింద వర్షం పడినప్పుడు నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు తెలిపారు. శుక్రవారం అక్కడ జరుగుతున్న మురుగు కాలువల పునరుద్ధరణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వర్షం కురిసినప్పుడు అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచి, వాహనదారులు ఇబ్బంది పడుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజి భరత్ దృష్టికి వచ్చిందని, అప్పుడే తక్షణమే తాత్కాలిక పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 25 మంది ప్రత్యేక సిబ్బందితో చర్యలు చేపట్టామని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్ష అధికారి నాగరాజు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

**ఆర్మూర్, ఏప్రిల్ 18(మనంన్యూస్):** తెలంగాణ పిసిసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో, ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ సమక్షంలో సికింద్రాబాద్, నిజామాబాద్, జైరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు, ప్రోటోకాల్ ఇంచార్జ్ విశ్వనాథ్, జిల్లా, ఇన్చార్జ్ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్, జువ్వాడ నర్సింగ్ రావు, జిల్లా మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆర్మూర్ బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, ఊరు వివిధ పార్లమెంట్ స్థాయి నాయకులతో సమీక్ష సమావేశం గాంధీభవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పిసిసి మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ ఆశయాలకు అనుకూలంగా, కాంగ్రెస్ పార్టీలోని ప్రతి ఒక్కరూ ప్రజల్లో ఉండి, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులైన వారికి అందిస్తూ, ప్రజా ధారణ పొందాలన్నారు. పార్టీలో ఉంటూ వ్యతిరేక పనులు చేపట్టిన, సంక్షేమ పథకాల్లో అవినీతికి పాల్పడిన వారు ఎంతటి వారైనా సహించేలేదని రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.



# అకాల వర్షం..అపార నష్టం



**కౌతాళం, ఏప్రిల్ 18 (మనం న్యూస్):** కౌతాళం మండల పరిధిలోని మెళగనూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం భారీ ఇదురుగాలులతో కూడిన వడగండ్లు వర్షం పడి గ్రామంలోనే ఈ వర్షానికి కొన్ని గుడిసెలలు పై కప్పు ఎగిరిపోవడం జరిగింది.మరియు చెట్లు భారీ గాలి బీభత్సానికి విరిగిపోయాయి. అలాగే వానకు దెబ్బతిన్న వరి పంటలు కావున నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయవలసిందిగా గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## సీనియర్ సిటిజన్స్ ఐడి కార్డులు తీసుకోవాలి

- **నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ**



**కర్నూలు, ఏప్రిల్ 18మనం న్యూస్ :** నగరంలో వయో వృద్ధులు ఐడి కార్డులు తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 60 ఏళ్ళు పైబడిన పురుషులు, 50 ఏళ్ల పైబడిన మహిళలు సీనియర్ సిటిజన్గా పరిగణించబడతారని, వారు తమ సచివాలయాల్లో ఐడి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజు ఫోటో, రూ.40 రుసుము చెల్లిస్తే ఐడి కార్డు మంజూరు అవుతుందని, దీని ద్వారా రవాణా సమయంలో, వివిధ సందర్భాల్లో క్యూలైన్లు, ఇతరత్రా సమయాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని, కావున వయో వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీవీ కోరారు.

## జిటిహెచ్ సందర్శన



**నిజామాబాద్ ప్రతినిధి మనం న్యూస్ ఏప్రిల్ 18:** ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ''పేరుకె పెద్ద డాక్టర్లు'' ఇలా వస్తారు..అలా వెళ్ళిపోతారు'' మనం పేపర్లో వచ్చిన అనే శీర్షికపై రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ గురువారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సందర్శించడం జరిగింది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేసే పెద్ద పెద్ద డాక్టర్లు సరిగా విధులు నిర్వహించకుండా బయోమెట్రిక్ వేసుకొని ఇలా వచ్చి అలా వెళ్ళిపోవడం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రోగులు రోగి బంధువులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.. '' మనం'' దినపత్రికలో వచ్చిన స్టోరీ పై రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ స్పందించడంతో గురువారం ఆకస్మిక తనీఖి నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని పెద్ద పెద్ద డాక్టర్లు నిర్వస్తున్న విధులతోపాటు సర్జరీలు, వైద్య చికిత్సలు రోగులకు ఎలాంటి సేవలు చేస్తున్నారని శూన్యంగా పరిశీలించారు. అంతేకాకుండా జిల్లా కలెక్టర్ తో డైరెక్టర్ ఆఫ్ వైద్య విద్య డైరెక్టర్ ఆన్లైన్లో డాక్టర్ల పనితీరుపై సంభాషించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చి రోగులు ఎంతో నమ్మకంతో మెరుగైన వైద్యం కోసం వస్తుంటారని, అన్ని విభాగాలకు సంబంధించిన ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, తోపాటు హౌస్ సర్జన్, మెడికో విద్యార్థులు రోగులకు సకాలంలో వైద్యం అందించాలని ఆదేశించినట్లు తెలిసింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మొహమ్మద్ షబ్బీర్ అలీ సలహాల సూచనలు మేరకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఆయన వైద్యులకు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా పేరుకే పెద్ద పెద్ద వైద్యులని తీరా చూస్తే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు అత్యవసర సమయంలో క్షతగాత్రులకు ఆపరేషన్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూనందుకు చిన్న చిన్న వైద్యులు ఏమి చేయలేక హైదరాబాద్లోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నట్లు డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి ఫిర్యాదులు వస్తున్నాయని, మరోసారి ఇలాంటి పిర్యాదు ఫిర్యాదులు వస్తే మాత్రం ఎంత పెద్ద వైద్యుడైన ఉపేక్షించేది పోదని, శాఖ పరమైన చర్యలు తప్పవని ఆయన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులని వైద్యులకు హెచ్చరించినట్లు తెలిసింది.

# రద్దీ ప్రాంతాల్లో పోలీసులు డాగ్ స్వాడ్ తో తనిఖీలు

- **శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలి**

**టూ టౌన్ ఎస్సై సైదులు**



**నల్గొండ,ఏప్రిల్ 18 ( మనం న్యూస్):** నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు టూ టౌన్ ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో నిషేధిత మత్తుపదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ వస్తువులను గుర్తించేందుకు శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ స్క్వాడ్లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బస్టాండు తో పాటు లాడ్జి, దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఎస్సై సైదులు మాట్లాడుతూ.. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కల్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.మరియు అదే విధంగా లాడ్జీల్లో బస చేసే వారి సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని, వారి యొక్క వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వవద్దన్నారు. అనుమానితుల వివరాలను వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

**గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి**

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటి నిర్మూలనకు ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని కోరారు. ఎవరైన నిషేధిత మత్తు పదార్థాలు వాడితే చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రజల ప్రాణాలకు హాని చేసే గంజాయి లాంటి మత్తు పదార్థాలను నిర్మూలించడంలో ప్రజలు, యువత కీలక పాత్ర పోషించాలని చెప్పారు. పట్టణంలో గంజాయి మూలాలను తొలగించడం కోసం పట్టణ పోలీసులు పటిష్ఠంగా పనిచేస్తున్నామన్నారు. సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై అన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పలువురు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు

- **రామారెడ్డి మండల కేంద్రంలో ఘటన..**
- **షీ టీం కి పిర్యాదు చేసిన విద్యార్థినులు**
- **ఆలస్యంగా వెలుగులోకి..**

**కామారెడ్డి క్రైమ్, ఏప్రిల్ 18 ( మనం న్యూస్ ):** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ వారికి మార్గదర్శకంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు దారి తప్పుతున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన చేతులతోనే దారుణాలకు పాల్పడుతున్నారు. చదువులు నేర్పాల్సిన వారే విద్యార్థినుల పట్ల వేధింపులకు గురి చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని పలువురు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలు ఇటీవల వెలుగుచూశాయి. గడిచిన మూడు నెలల్లో 8 మంది టీచర్లపై పోక్సో కేసులు నమోదయ్యాయి. అనంతరం విద్యాశాఖ వారిని విధుల నుంచి తొలగించింది. అయినా పలువురి తీరు మాత్రం మారడం లేదు. వివరాల్లోకి వెళ్తే కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని ఓ గ్రామ పాఠశాలలో పనిచేసే పీఈటీ డాన్స్ క్లాసులు చెప్పేవాడు. అయితే కొందరు విద్యార్థినుల పట్ల పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో వారు షీటీంకు ఫిర్యాదు చేశారు. స్పందించిన చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్రవంతి విచారణ చేపట్టారు. 9మంది విద్యార్థినులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా సదరు పీఈటీపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడంతో నాలుగు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పీఈటీపై పోక్సో కేసు నమోదైన రామారెడ్డి మండలంలోనే రెండురోజుల క్రితం మరో ఇద్దరు ఉపాధ్యాయులపై కూడా పోక్సో కేసులు నమోదవ్వడం విస్మయానికి కలిగిస్తోంది. ఇదే మండలంలోని పాఠశాలల్లో 8 మంది విద్యార్థినుల పట్ల ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తించడంతో వారిపై కేసులు నమోదయ్యాయి. చాలా చోట్ల విద్యార్థినులు హెచ్ఎంలకు చెప్పడంతో సదరు ఉపాధ్యాయులను మందలించి వదిలేస్తున్నా రని సమాచారం. భిక్కనూరు మండలంలో ఇలాగే సెటిల్మెంట్ ఘటన వెలుగులోకి రాగా సదరు టీచ్చ సెటిల్మెంట్ చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేశారు. గతంలో బాన్సువాడలోనూ ఇలాంటి ఘటనే జరిగింది.

# నకిలీ విత్తనాలు విక్రయించే షాపులపై ప్రత్యేక నిఘా

- **జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్**




**మహబూబ్ నగర్,ఏప్రిల్ 18(మనం బ్యూరో):** నకిలీ విత్తనాలు సరఫరా జరిగి రైతులు నష్టపోక ముందే అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి, నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలి, నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దు అని జిల్లా ఎస్పీ డి.జానకీ తెలిపారు. సంభందిత అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ వితనాలు సరఫరా జరగకుండా చూడాలి అన్నారు. రాష్ట్రానికి, దేశానికి వ్యవసాయం ముఖ్యమైన ఆధారం అలాంటి వ్యవసాయం చేసే రైతులు ఆరుగాలం కష్టపడి నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై పై ఉన్నది, విత్తన వ్యాపార డీలర్స్ బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి అన్నారు. రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తాము, పీడీ యాక్ట్ తప్పదు, షీట్స్ నమోదు చేస్తాం అని హెచ్చరించారు. మహబూబ్ నగర్ జిల్లా సరిహద్దుల ప్రాంతంల నుండి నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉన్నది, ముందస్తు తనిఖీలు, రైతులకు అవగాహన కల్పించడం, డీలర్స్ కు అవగాహన కల్పించడం, సరిహద్దు లలో పటిష్టమైన నిఘా తో నకిలీ విత్తనాలు నివారించాలి అని ఎస్పీ అన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలి, గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్నవారి పై నిఘా ఉంచాలి అని ఆదేశించారు. రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి అని ఎస్పీ విజ్ఞప్తి చేసినారు నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలి, లేబుళ్ళు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దు అని కోరినారు, తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి వచ్చే మధ్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దు, ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్స్ నుండి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిది అన్నారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాల లనుండి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరినారు. నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసు వారికి, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి అని కోరినారు.

# గర్భిణులకు పోషకాహారం అవసరం

- **ఐసిడీఎస్ అధికారిణి పద్మజ సూచన**



**బోధన్, ఏప్రిల్ 18 (మనం న్యూస్):** గర్భిణీ స్త్రీల ఆరోగ్యం బాగుండాలంటే వారు తప్పనిసరిగా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ అధికారిణి పద్మజ తెలిపారు. శుక్రవారం బోధన్ మండలంలోని మా వంది ఖుర్ధ్ గ్రామం,పట్టణంలోని ద్యాకం గల్లీ అంగన్వాడి కేంద్రాల్లో 'పోషణ పక్వాడ' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన సరైన ఆహార నియమాలపై ఆమె అవగాహన కల్పించారు.రక్తహీనతను నివారించాలంటే తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు, పాలు వంటివి సమృద్ధిగా తీసుకోవాలని సూచించారు.అలా చేస్తే తల్లీబిడ్డల ఆరోగ్యం మెరుగవుతుందని చెప్పారు.పోషకాహారం తీసుకోకపోతే వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించిన పద్మజ, పిల్లలకు బయట జంక్ ఫుడ్ ఇవ్వకూడదని, ఇంట్లో తయారుచేసిన ఆరోగ్యకరమైన భోజనమే అందించాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గోపిలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ, గ్రామ కార్యదర్శి రాజేష్, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిమిత్తమాత్రుడివై...

దేవుడి పాదాలపైన పూలు వుంచడానికే
నీవు నిమిత్తమాత్రుడివై... గుడికి వెళ్ళకు;
అంతకన్నా ముందుగా-
నీ ఇంటిని ప్రేమపరిమళంతో నింపుకో!
దేవుడి సన్నిధిలో దీపాలు వెలిగించడానికే
నీవు నిమిత్తమాత్రుడివై... గుడికి వెళ్ళకు;
అంతకన్నా ముందుగా-
నీ హృదయంలో పాపతిమిరాన్ని
తొలగించుకో!
తలవంచి వినయంగా ప్రార్థించడానికే
నీవు నిమిత్తమాత్రుడివై... గుడికి వెళ్ళకు;
అంతకన్నా ముందుగా-
నీవు కిందికి వంగి
అణచివేతకు గురై లేవలేనివారిలో ఒకరిని
చేయూత నిచ్చి పైకి లేపు!

చేసిన పాపాలకు క్షమాపణ అడగడానికే
నీవు నిమిత్తమాత్రుడివై... గుడికి వెళ్ళకు;
అంతకన్నా ముందుగా-
పాపాలు చేసిన వారిని
(వారు పశ్చాత్తాపచిత్తులై అడిగినప్పుడు)
హృదయపూర్వకంగా క్షమించడం నేర్చుకో!!!


మూలం: రవీంద్రనాథ్ ఠాగూర్
స్వేచ్ఛానువాదం - 'రఘువర్మ'
9290093933

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# ఆరోగ్యాన్ని హరిస్తున్న ఆధునిక జీవనశైలి



పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు అన్నీ వయస్సుల ప్రజల జీవితం మీద ప్రభావం చూపుతున్నాయి. పాత తరం జీవనశైలిలో భౌతిక శ్రమ ఎక్కువగా ఉండేది, కానీ ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ తక్కువవుతుంది. దీని ప్రభావంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా మన దేశంలో అకాల మృతులకు 60 శాతం వరకు జీవనశైలి వ్యాధులే కారణమవుతున్నాయి. ఆధునికత పేరు చెప్పి మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. మన చేతుల చేత మన ఆరోగ్యాన్ని తుడిచిపెడుతున్నాం: జీవితశైలి పేరుతో వస్తున్న కొని తెచ్చుకుంటున్న నాశనం.



**పెద్ద నగరాల్లో తీవ్రత ఎక్కువ**

జీవనశైలి వ్యాధులలో ముఖ్యంగా గుండెజబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలు అధికంగా ఉన్నాయి. ఫాస్ట్ ఫుడ్, శారీరక వ్యాయామం లోపం, తినే విధానం, ఒత్తిడిగల జీవనశైలి ఇవన్నీ ముఖ్య కారణాలు. మహానగరాల్లో జీవించే ప్రజల్లో ఈ వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నలబై ఏళ్ల లోపే హార్ట్ ఎటాక్లు వస్తుండటం కేవలం జీవనశైలిలో మార్పుల వల్లే జరుగుతోంది.

**మనుషులు ఆరోగ్యాన్ని తాకట్టు పెట్టారు**

ఆహార అలవాట్లలో మార్పు, ఫిజికల్ యాక్టివిటీ లోపం, ఒత్తిడి మరియు నిద్రలేమి వల్ల నానాటికీ జీవనశైలి వ్యాధులు పెరిగిపోతున్నాయి. ఆధునిక జీవనశైలిలో మానవుడు ఆరోగ్యాన్ని తాకట్టు పెడుతున్నాడు. గ్యాడ్జెట్లు, బిజీ షెడ్యూల్స్, ఆరోగ్యంపై నిర్లక్ష్యం వంటి వాటితో పాటు, స్మార్ట్ఫోన్ వినియోగం కూడా దీని మీద ప్రభావం చూపుతోంది.

**మానసిక ఆరోగ్యంపై దృష్టి**

జీవనశైలి మార్పులు శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు కొన్ని చిట్కాలు ముఖ్యమైనవి: రోజూ ఒకే సమయానికి నిద్ర, భోజనం, కార్యాచరణ ఉండేలా జీవనశైలి సజావుగా ఉండాలి. కనీసం 30 నిమిషాల వ్యాయామం లేదా యోగా, ప్రాణాయామం చేయడం మనశ్శాంతికి దోహదం చేస్తుంది. ధ్యానం మరియు శ్వాస నియంత్రణతో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఆహారంలో పండ్లు, కూరగాయలు, ఒమేగా-3 వంటివి చేర్చాలి. నిద్ర పరిపూర్ణంగా ఉండేలా చూసుకోవాలి (7-8 గంటలు అవసరం). స్నేహితులు, కుటుంబ సభ్యులతో అనుబంధం కొనసాగించాలి. సెల్ ఫోన్ వినియోగాన్ని నియంత్రించాలి. కళలకు అవకాశమివ్వడం ద్వారా భావోద్వేగాల్ని సమతుల్యంగా ఉంచుకోవచ్చు. ఈ చిట్కాల వల్ల మనస్సు ఆరోగ్యంగా ఉండటమే కాక, జీవితం సంతృప్తికరంగా మారుతుంది.

**ఒత్తిడితో బతుకు ఛిద్రమవుతోంది**

ప్రస్తుత ఆధునిక జీవన శైలి మనిషిని ఓ యంత్రంగా మార్చేసింది. పనుల ఒత్తిడి, సమయపు తగ్గుదల, సామాజిక ఒత్తిళ్లు అన్నీ కలిసివచ్చి మనుషులను అంతర్ముఖులుగా మార్చేస్తున్నాయి. నిత్యం పరుగులు పెట్టే జీవితంలో మనసుకు తృప్తి లేక, శరీరానికి విశ్రాంతి లేకుండా పోతోంది. ఈ ఒత్తిడిలో శ్వాస కూడా భారంగా అనిపించడం మనిషికి సాధారణంగా మారిపోతోంది. ఒత్తిడి వల్ల మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి, ఆరోగ్యం పాడవుతోంది, ఆనందం దూరమవుతోంది. ఆర్థిక విజయాల కోసం కష్టపడుతూ, మనిషి తనే నిస్సారంగా మారుతున్నాడు. భౌతిక విజయం కోసం పరిగెత్తే ఈ యుగంలో, మనస్సుకు నయం కలిగించే ప్రశాంతత అరుదైపోతోంది. ఈ పరిస్థితుల్లో మన మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం అత్యవసరం.

**మానసిక ప్రశాంతత ఇప్పుడు అత్యవసరమైన ఔషధం**

ప్రజలు తమ జీవనశైలిని పునఃపరిశీలించాలి. రోజూ క్రమంగా వ్యాయామం, సమతుల్య ఆహారం, సరైన నిద్ర, మానసిక శాంతి కోసం యోగా, ధ్యానం లాంటి కార్యక్రమాలను అనుసరించాలి. ప్రభుత్వం మరియు ఆరోగ్య శాఖలు ఈ విషయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అలాగే కుటుంబ సభ్యుల మద్దతు, ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ప్రజలందరూ తమ జీవనశైలిని మెరుగుపరచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. నవ్వు జాడలేని ముఖాలు, నిరాశతో నిండిన కన్నులు. ఇవే ఆధునిక జీవితం గుర్తులు. ఈ బతుకు జట్కా బండిలో ఏం కోల్పోయామో నెమ్మదిగా తెలుసుకుంటున్నాం. కానీ చాలా ఆలస్యం అయిన తర్వాత ఒత్తిడిలో మునిగిపోయిన ఈ సమాజానికి, ఓ కాసింత మానసిక ప్రశాంతత ఇప్పుడు అత్యవసరమైన ఔషధం.

- డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి
9703935321

# ఆరోగ్యానికి మూలం-కాలేయం

మన శరీరంలోని అతి ముఖ్యమైన అంతర్గత అవయవాల్లో కాలేయం (లివర్) కీలకమైనది. సుమారు 1.5 కిలోల బరువుతో ఇది శరీరంలో జీర్ణక్రియ, డీటాక్సిఫికేషన్, శక్తి నిల్వ, రక్తంలో చక్కెర నియంత్రణ, కొవ్వుల మార్పిడి వంటి అనేక ప్రక్రియల్లో భాగస్వామ్యమవుతుంది. మీ రక్తం శుభ్రంగా ఉండేలా మరియు మీ శరీరం సజావుగా పనిచేసేలా చేస్తుంది. ఇది దాదాపు 500కు పైగా విధులను నిర్వహించగలదు. కాలేయం లేకుండా మన ప్రాణాధారం నిలబడదు. మన శరీరంలో కాలేయం కీలకమైన పనులను నిర్వహిస్తుంది - రక్తాన్ని శుభ్రపరచడం, శక్తిని నిల్వ చేయడం, పోషకాలను సరఫరా చేయడం వంటి విభిన్న కార్యకలాపాల్లో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇది 60-70% వరకు నష్టం చెందినా కూడా తనను తాను పునరుత్పత్తి చేసుకునే అపూర్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే, ఈ శక్తివంతమైన అవయవం కూడా సులభంగా దెబ్బతినే అవకాశం కలిగి ఉంటుంది. మానవ శరీరంలో రెండవ అత్యంత సంక్లిష్టమైన అవయవంగా పరిగణించబడే కాలేయం లేకుండా, శరీరంలోని ఇతర కణజాలాలు పోషకాల కొరతతో బతకలేరు.

ఈ విలువైన అవయవాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది! అనేక మార్గాల్లో తెలిసో ,తెలియకో మనమే మన కాలేయానికి హాని కలిగించేలా ప్రవర్తిస్తున్నాం. సమతుల్యం లేని ఆహారం, మద్యపానం, శారీరక చలనం లేకపోవడం, వేగంగా తినే అహారాల అలవాటు, ఇవన్నీ కాలేయాన్ని దెబ్బతీసే ప్రధాన కారణాలు.



ఈ నేపథ్యంలో, ప్రతి ఏప్రిల్ 19న జరుపుకునే ప్రపంచ కాలేయ దినోత్సవం ప్రజల్లో కాలేయ ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేయబడింది. 2025 సంవత్సరానికి గల ఇతివృత్తం: ఆహారమే ఔషధం. ఈ సందేశం కాలేయ ఆరోగ్య పరిరక్షణలో ఆహార ప్రాముఖ్యతను నొక్కిచెబుతోంది.

ఆహారం మన ఆరోగ్యం మీద ప్రధాన ప్రభావం చూపుతుంది. అధిక కొవ్వు, చక్కెరలతో కూడిన ప్రాసెస్డ్ ఫుడ్స్, డీప్ ఫ్రైడ్ పదార్థాల వల్ల కాలేయ కణజాలంలో కొవ్వు చేరి ఫ్యాటీ లివర్ (ఊబ్బడ ఔజీర్ఫిట) సమస్య ఏర్పడుతుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే అది లివర్ ఇన్ఫ్లమేషన్, లివర్ ఫైబ్రోసిస్, చివరకు సిరోసిస్ వరకు తీసుకెళ్తుంది.

ఇవే కాదు, హెపటైటిస్ అ, ఆ, ఇ లాంటి వైరస్లు కూడా కాలేయ ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా ఆ మరియు ఇ వైరస్లు శరీరంలో మౌనంగా వ్యాపించి, సంవత్సరాల తరబడి తెలియకుండానే దెబ్బతీసి చివరికి కాలేయ క్యాన్సర్కు దారి తీసే ప్రమాదం కలిగి ఉంటాయి. అయితే ప్రారంభ దశల్లోనే ఇవి గుర్తించగలిగితే, టీకాలు; ఔషధాల ద్వారా ప్రభావాన్ని తగ్గించగలము. అందుకే కాలక్రమంగా పర్యవేక్షణ పరీక్షలు, స్క్రీనింగ్లు తప్పనిసరిగా చేయించుకోవడం అత్యవసరం.

**కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం కోసం ఆహార నియమాలు పాటించటం అత్యవసరం:**

అధిక ఫైబర్ కలిగిన పండ్లు, కూరగాయలు తీసుకోవాలి పూర్తి ప్రాసెసింగ్ చేయని ధాన్యాలు, పప్పులు ఉపయుక్తం ఆరోగ్యకరమైన కొవ్వులైన ఆలివ్ ఆయిల్ వాడాలి కాఫీ మరియు గ్రీన్ టీని మోతాదులో తీసుకోవడం లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఎక్కువ నీరు తాగడం కాలేయం డీటాక్స్కు సహాయపడుతుంది ఇవి కాకుండా, ఆహారం మాత్రమే కాదు, వ్యాయామం, మంచి నిద్ర, ఒత్తిడి నియంత్రణ కూడా కాలేయ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి. మద్యపానం పరిమితిలో ఉంచుకోవాలి. అదేవిధంగా, డాక్టర్ అనుమతి లేకుండా ఏదైనా సప్లిమెంట్లు, లేదా ఆయుర్వేద మందులు స్వచ్ఛందంగా వాడకూడదు.

ప్రపంచంలో దాదాపు 150 కోట్ల మందికి పైగా ఫ్యాటీ లివర్, హెపటైటిస్, సిరోసిస్ వంటి కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రతి ఏడాది 20 లక్షల మంది కాలేయ సంబంధిత కారణాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. వీటిలో చాలావరకు తగిన సమయంలో గుర్తించి చికిత్స ప్రారంభిస్తే నివారించవచ్చు.

ప్రతి భోజనాన్ని ఔషధంగా భావించి, సమతుల్య ఆహారం, నిరంతర వ్యాయామం, మానసిక శాంతితో కూడిన జీవనశైలి- ఇవన్నీ కాలేయ సంరక్షణకు మూలస్తంభాలు. ఈ ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా, మన శరీరం, ముఖ్యంగా ఈ అమూల్య అవయవాన్ని ప్రతిరోజూ జాగ్రత్తగా పరిరక్షిస్తామని గట్టి నిబద్ధతగా ప్రతిజ్ఞ చేద్దాం.

**(ప్రపంచ కాలేయ దినోత్సవం - ఏప్రిల్ 19, 2025 సందర్భంగా)**

డా. వేపకొమ్మ కృష్ణ కుమార్చ్

## ఆమె జ్వరగ్రస్తం అయినప్పుడు

గిన్నెలో ఉన్న మెతుకంతా
పిల్లలకు ఊడ్చిపెట్టి
తాను ఉపవాసం అంటుంది

పట్టుచీర మీద ఆశ ఉన్నా
పండుగ పూట మనసు నొప్పించదు
ఎదురింటి అమ్మ ఏడు వారాల నగలు
వెక్కిరిస్తున్నా
పెళ్ళి నాటి పుస్తెలతాడుకు మురిసిపోతూ
పేదరికాన్ని ఎన్నడూ బాధ పెట్టదు

చీకటిని ఊడ్చేయాలని
కలలు ఎక్కడో పోగొట్టుకున్న
నిద్ర రాని నిత్య శ్రామికురాలు

తాను ఎప్పుడన్నా జ్వరగ్రస్తమయితే
రోజంతా
కాలం కదలని మొద్దు అవుతుంది
ఇల్లు

ఎంతకూ చేతికి చిక్కని
గొలుసు తెంచుకుని పోయిన కుక్కపిల్ల
ఎంత బుజ్జగించినా
మారాము చాలించని చంటి పాప

అన్నీ నల్లపూసలు అయినట్టు
ఏది ఎక్కడుంటదో
ఎంత మొత్తుకున్నా
వొంటిల్లు ఉలుకదూ పలుకదూ
చెయ్యి కాలకుండా పొయ్యి వెలగదు
దీపం కూడా కుదురుగా నిలబడదు

ఆమె విశ్రాంతి కోరుకుంటే
భూకంపం వచ్చినట్టు
పనులన్నీ కుప్పకూలుతయి
శిథిలాల లోంచి మొలిచినట్టు ఒక చేయి
తన సాయం కొరకు ఎదురుచూస్తుంది.

- గజ్జెల రామకృష్ణ
8977412795

## ప్రేమ గాయం

ఆమె
తండ్రితో భేదించి గడప దాటింది
ఆయన
తల్లితో వాదించి ఇల్లు వదిలాడు
ఇద్దరూ
సమావేశమయ్యారు
సమాంతర రేఖలుగా ఉండొద్దని భావించారు
పేద ధనిక ప్రాంతీయ కులమతాలు
త్యజించారు
ప్రేమ దేవతను పూజించారు
రేపు వాకిలి
నెత్తురు లో తడుస్తుందని
కాపు కాసిన కొడవలి
ఒకటి వేటాడుతుందని ఊహించలేదు

- కోటం చంద్రశేఖర్
9492043348

# లారీ చోదకుల సమస్యలు తీరేదెప్పటికి ?



వ్యవసాయ రంగం తరువాత మన దేశంలో అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం రవాణా రంగం. ఈ రంగం దేశాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. భారత దేశపు ట్రక్కింగ్ పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక ముఖ్యమైన ఊతమిస్తూ జిడిపికి ఆరు శాతానికి పైగా దోహదం చేస్తోంది. లక్షలాది మందికి జీవనోపాధిని అందిస్తున్నది. ఈ కీలకమైన రంగంలో ట్రక్కు డ్రైవర్లు ఒక అనివార్యమైన పాత్రను పోషిస్తున్నారు. దేశంలో 80 లక్షలకు పైగా ట్రక్కు డ్రైవర్లు ఉన్నారని అంచనా. ట్రక్కు డ్రైవర్లకు సౌకర్యాలు మెరుగుపరచడంపై దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరం నుండి కొత్తగా తయారుచేసే ఎన్2, ఎన్3 వర్గాల ట్రక్కుల డ్రైవర్ క్యాబిన్‌లో ఎయిర్ కండిషనింగ్ తప్పనిసరిగా ఉండాలని ఇదివరకే ఆదేశించింది. వేడి వాతావరణ పరిస్థితుల్లో డ్రైవర్ల అలసటను తగ్గించి తద్వారా వారి పని సామర్థ్యాన్ని పెంచాలనే అవగాహనతో ఈ నిర్ణయం తీసుకోబడింది. ఇది నిజంగా ప్రశంసనీయమైన చర్య.

**70 శాతం రోడ్డు ద్వారానే**

2022 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం మన దేశం తన దేశీయ సరుకులో 70శాతం రోడ్డు మార్గం ద్వారా రవాణా చేస్తుంది. భారతీయ రహదారులపై తిరుగుతున్న ట్రక్కుల సంఖ్య 2022లో నలభై లక్షల నుండి 2050 నాటికి ఒక కోటి డెబ్బై లక్షలకు చేరుకుంటుందని నివేదికలు సూచిస్తున్నాయి. ట్రక్కులు పరిమాణం ప్రకారం రహదారి వాహనాలలో కేవలం 2శాతం మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ భారతదేశంలోని 28 లక్షల ట్రక్కులు సమిష్టిగా సంవత్సరానికి పదివేల కోట్ల కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తూ 460 కోట్ల టన్నుల సరుకును రవాణా చేస్తున్నాయి. వార్షిక రవాణా డిమాండ్ ప్రస్తుతం 2.2 ట్రిలియన్ టన్ను-కిలోమీటర్లుగా ఉంది. 2050 నాటికి నాలుగు రెట్లు పెరిగి 9.6 ట్రిలియన్ టన్ను-కిలోమీటర్లకు చేరుకుంటుందని అంచనా వేయబడింది. రవాణా డిమాండ్ అనేది జనాభా, భూ వినియోగం, ఆర్థిక ప్రభావాలతో సహా వివిధ బాహ్య కారకాల కలయిక నుండి ఉత్పన్నమయ్యే సంచిత ప్రయాణ అవసరాన్ని సూచిస్తుంది.

**ప్రమాదాల కారణాలు**

రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన వేర్వేరు గణాంకాల ప్రకారం ట్రక్కులు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలలో ఒకటిగా ఉన్నాయి. భారతదేశంలోని 'రోడ్డు ప్రమాదాలు - 2022' వార్షిక నివేదికలోని గణాంకాలను పరిశీలిస్తే మొత్తంరోడ్డు ప్రమాదాలలో 32.9 శాతం (1,51,997), మొత్తం మరణాలలో 35.7 శాతం (55,571) జాతీయ రహదారుల పైనే సంభవించాయి. కొంతమంది డ్రైవర్లు మద్యం లేదా మాదక ద్రవ్యాల ప్రభావంతో వాహనాలు నడపడం, వాహనాల అధిక బరువు వంటి అంశాలు ఈ ప్రమాదాలకు ముఖ్యమైన కారణాలుగా ఉన్నాయి.

**ఎదుర్కుంటున్న సవాళ్లు**

జాతీయ రహదారులపై ట్రక్కు డ్రైవర్లు అనేక కష్టతరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించి వారికి నాణ్యమైన డ్రైవింగ్ అనుభవాన్ని వారి జీవనోపాధిపై భరోసా ఇవ్వడం అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంది. ఈ డ్రైవర్లు తరచుగా ఆహారం, నిద్ర, విశ్రాంతి కోసం తగినంత సమయం లేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. చాలా మందికి, వారి ట్రక్కే వారి ప్రయాణాలలో తాత్కాలిక నివాసం. ఈ రంగం వృద్ధి చెందుతున్నప్పటికీ, పరిష్కారానికి ప్రత్యేక విధానం అవసరమయ్యే సంక్లిష్టమైన సవాళ్ల శ్రేణితో ఇది పోరాడుతోంది. జాతీయ రహదారులపై ప్రయాణించే ట్రక్కు డ్రైవర్లు తరచుగా తక్కువ సమయంలో సుదూర ప్రాంతాలకు సరుకులను చేర్చాలనే ఒత్తిడికి గురవుతారు, దీని కారణంగా రోజుకు ఎక్కువ గంటలు డ్రైవింగ్ చేయవలసి వస్తుంది. ఫలితంగా వాహన వేగాన్ని పెంచుతారు. గణనీయమైన సంఖ్యలో డ్రైవర్లు రోజుకు 14 గంటల వరకు వాహనాలు నడుపుతున్నారని పరిశోధనలు సూచిస్తున్నాయి.

ఇది ప్రమాదాల తీవ్రతను గణనీయంగా పెంచుతుంది. వారి నిరంతరాయమైన పని స్వభావం కారణంగా దాదాపు 50% మంది ట్రక్కు డ్రైవర్లు డ్రైవింగ్ సంబంధిత ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.


ఎక్కువసేపు కూర్చోవడం తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. సమయం లేకపోవడం లేదా వారికి అలవాటైన భోజనం అందుబాటులో లేకపోవడం వల్ల 70శాతం కంటే ఎక్కువ మంది డ్రైవర్లు పోషకమైన ఆహారం తీసుకోలేక పోతున్నారు. ఇది ఊబకాయం, ఎముకలు, కండరాల సంబంధిత రుగ్మతలు, అధిక రక్తపోటు, నిద్రలేమి, అధిక ఒత్తిడి స్థాయిలు, డీహైడ్రేషన్ వంటి అనేక ఆరోగ్య సమస్యలకు వారిని గురిచేస్తుంది.

చాలా మంది స్థానిక భాష తెలియకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణంలో అనారోగ్యానికి గురైతే, ఆర్థిక ఇబ్బందుల కారణంగా సరైన వైద్య సంరక్షణ పొందలేకపోతున్నారు. వాహనాలు మొరాయించినా లేదా ప్రమాదాలకు గురైనా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అంతేకాకుండా కొన్ని మార్గాల్లో దోపిడీలు సర్వసాధారణం. సరుకు దొంగతనాలు తరచుగా జరుగుతున్నాయి. దురదృష్టవశాత్తు ఈ నేరాలకు ప్రతిఘటించే డ్రైవర్లు హత్యకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. స్థానిక సమాజాల నుండి మద్దతు తరచుగా ఉండదు. ఇంటి నుండి ఎక్కువ కాలం దూరంగా ఉండటం అనేక మంది డ్రైవర్లలో మానసిక వేదనకు దారితీస్తుంది. అదనంగా అసురక్షిత లైంగిక కార్యకలాపాలలో పాల్గొనడం లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు, హెచ్ఐవితో సహా ప్రమాదాన్ని పెంచుతుంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఈ డ్రైవర్లకు సాధారణంగా నెలవారీ జీతాలు ఉండవు, వారు ట్రిప్పులు చేసిన రోజులకు మాత్రమే వేతనాలు పొందుతారు. ఈ అస్థిరమైన ఆర్థిక పరిస్థితి వారి కుటుంబాలను పోషించడం కష్టతరం చేస్తుంది. యువత ఈ వృత్తిని స్థిరమైన కెరీర్ మార్గంగా ఎంచుకోవడానికి వెనుకడుగు వేయడానికి ఇది ఒక కారణం. మన దేశంలో ట్రక్కు డ్రైవర్ సగటు వార్షిక జీతం సుమారు 3,14,600 లేదా నెలకు 17,040, ఇది జాతీయ సగటు జీతం 72,900 కంటే 19% తక్కువ. ఈ రంగంలో అధికారికీకరణ ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉండటం వల్ల ట్రక్కింగ్ యొక్క వాంఛనీయ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి అర్హత కలిగిన డ్రైవర్ల కొరత ఇటీవలి కాలంలో ఈ రంగాన్ని వేధిస్తున్న ఒక నిరంతర సమస్య. మన దేశంలో డ్రైవర్-టూ-ట్రక్ నిష్పత్తి ఇప్పటికీ 1000 ట్రక్కులకు 750 కంటే తక్కువగా ఉంది. దీని ఫలితంగా కొన్ని సమయాల్లో 25% నుండి 30% ట్రక్కులు డ్రైవర్లు లేకపోవడం వల్ల ఖాళీగా ఉండిపోతున్నాయి.

**పరిష్కారాలు**

కేంద్ర ప్రభుత్వం ట్రక్కు యజమానులను డ్రైవర్లకు నెలవారీ జీతం ఇచ్చేలా ఒప్పించాలి. కనీస వేతన ప్రమాణాలను అమలు చేయాలి. రహదారులపై పెట్రోలింగ్ను పెంచడం ద్వారా డ్రైవర్లు తమ ప్రయాణాలలో ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించాలి. డ్రైవర్ల కోసం జాతీయ రహదారులపై ప్రత్యేక విశ్రాంతి స్థలాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం. రాత్రిపూట బస చేయడానికి వసతి సౌకర్యాలు కల్పించాలి. ప్రతి 400 కిలోమీటర్లకు హైవేల వెంట వారి ప్రత్యేక అవసరాల కోసం ఆసుపత్రులను ఏర్పాటు చేయాలి. ప్రతి డ్రైవర్ను సమగ్ర ప్రమాద బీమా పరిధిలోకి తీసుకురావాలి. ఈ చర్యలన్నీ ఒకేసారి సాధ్యం కానప్పటికీ, డ్రైవర్లకు క్రమంగా సౌకర్యాలు కల్పిస్తే మనం నిస్సందేహంగా ఉన్నతమైన నాణ్యమైన సేవలను పొందగలుగుతాము.

- జనక మోహన రావు దుంగ
8247045230



# భూ భారతి చట్టంతో మీ భూమి మీ చేతుల్లో..

- కలెక్టర్ జితేష్ వి పాటిల్..
- ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలకు పరిష్కారం
- గత ధరణితో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు
- రైతులకు అవగాహన కార్యక్రమం..




**కరకగూడెం, ఏప్రిల్ 18(మనం న్యూస్):** ప్రజల కోసం, ప్రత్యేకంగా రైతుల భూములపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కరకగూడెం మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాసిల్దార్ నాగప్రసాద్ ఏర్పాటుచేసిన భూభారతి అవగాహన కార్యక్రమానికి ఆర్డీఓ దామోదరావుతో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. భూసమస్యలపై రైతులు మీసేవలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశించిన సమయంలో స్థానిక తాసిల్దారులు పరిష్కరిస్తారన్నారు.ఈ చట్టం ద్వారా భూములకు సంబంధించి అవినీతిని అరికట్టి రెవెన్యూ శాఖను బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లడానికి పైలట్ స్టడీ కోసం ప్రత్యేకించి కొన్ని మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టం భూ వివాదాలకు పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. వివాదాలకు తావు లేకుండా రైతుల భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ కొత్త చట్టాన్ని తెచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తిస్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేయనున్నట్లు చెప్పారు. వారసత్వంగా వచ్చిన భూములకు ముందు సమగ్ర విచారణ చేస్తామన్నారు. గ్రామస్థాయిలోని సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. భూభారతి కొత్త చట్టం ద్వారా హక్కులు, భూ సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయని, నిజమైన భూ యజమానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో అప్పీల్ వ్యవస్థ ఉందని తహసీల్దార్ జారీ చేసిన ఆర్డర్ పై ఆర్డీవోకు, ఆర్డీవో జారీ చేసిన ఆర్డర్ పై కలెక్టర్ కు అప్పీలు చేసుకునే వెసులు బాటు తీసుకువచ్చిందని వివరించారు. కొనుగోలు, దానం, తనఖా, పాలు పంపకాల ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డుల్లో మార్పు చేసి హక్కుల రికార్డుల్లో మార్పు చేసి పట్టాదారు పాసు పుస్తకాన్ని జారీ చేస్తారని ఈ ప్రక్రియ ఒకేరోజులో పూర్తయ్యే విధంగా చట్టంలో పొందుపరిచారని తెలిపారు. భవిష్యత్తులో ప్రజల భూ సమస్యలు తలెత్తకుండా భూభారతితో చెక్ పెట్టవచ్చన్నారు. భూమి రిజిస్ట్రేషన్ అనంతరం లబ్ధిదారుడి పట్టా పాస్ బుక్ లో భూ మ్యాపింగ్ నమోదవుతుందని తెలిపారు. భూకమతాలకు భూధార్ కార్డులు జారీ చేయనున్నట్టు చెప్పారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చట్టంలోని ముఖ్యాంశాలను కలెక్టర్ స్వయంగా సమావేశంలో వివరించారు. మండలానికి చెందిన రైతుల నుంచి భూసంబంధిత ఫిర్యాదులు స్వీకరించి వాటిపై సమీక్షించి పరిష్కార విధానాలను తెలిపారు. రైతులు అడిగిన ప్రతి సమస్యకు కలెక్టర్ సవివరంగా వివరణ ఇచ్చారు. భూభారతి చట్టంపై తహసీల్దార్లు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు.నూతన చట్టాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిష్పక్షపాతంగా చట్టాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన భూభారతి పోర్టల్ కు గతంలోని ధరణి పోర్టల్ కు చాలా తేడా ఉందని, భూముల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగవద్దని ఉద్దేశంతో ప్రభుత్వం మరో 14అంశాలను పొందుపరిచిందని తెలిపారు. భూముల విషయంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఏడాదిలో పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. భూమి విలువ రూ.5లక్షల లోపు ఉంటే ఆర్డీఓ స్థాయి, రూ.5లక్షలకు పైగా ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం ఉందని తెలిపారు. ఇక నుంచి పరిశీలించిన తర్వాతనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగిస్తారని తెలిపారు. మే 1 నుంచి 31 వరకు పరిశీలన చేసిన అనంతరం జూన్ 2నుంచి పట్టాలు ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని తెలిపారు.భూ సమస్యల పరిష్కారానికే కాంగ్రెస్ ప్రభుత్వం'భూ భారతి' చట్టాన్ని తెచ్చిందని దీని ద్వారా రైతులకు సరైన న్యాయం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణిలో చాలా పొరపాట్లు జరిగాయని, అర్హులైన రైతులు నష్టపోగా పాలకులు వేల ఎకరాల భూమిని కబ్జా చేశారని అన్నారు. ధరణి ద్వారా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారిని గుర్తించి క్రిమినల్ కేసులు పెట్టాలని అన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. అధికారులు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతోపాటు ఈ చట్టంతో కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్ రావు, ఏడిఏ తాతారావు, తాసిల్దార్ నాగప్రసాద్, ఎంపీడీవో దేవ వర కుమార్, ఎంపీఓ మారుతి, డిప్యూటీ తాసిల్దార్ నాగయ్య,వ్యవసాయ శాఖ అధికారులు ప్రశాంత్ ,అనిల్, వైద్యాధికారి కారం మాదు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి ...

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్
- సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ : ఎమ్మెల్యే



**ఇనుగుర్తి, ఏప్రిల్ 18(మనం న్యూస్):** రైతులు పండించిన వడ్లు కొనుగోలు కేంద్రం లోనే అమ్మాలని తద్వారా రైతులకు అదనంగా ఇచ్చే 500రూ. లను పొందవచ్చని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ అన్నారు. ఇనుగుర్తి మండలం ఇనుగుర్తి,చెట్లముప్పారం గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయం సహకారం సంఘం, చిన్న నాగారం లో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రోజు ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలి, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు 500బోనస్ అందిస్తున్నట్లు గుర్తుచేశారు. రైతులకు ఉచిత కరెంట్, రుణ మాఫీ, రైతు భరోసా, 500బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు.దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. అందుకోసమే రాష్ట్రంలో సన్నాలు పండించే రైతులను ప్రోత్సహిస్తుందని అన్నారు. దీనివల్ల మన రైతుల వద్దనే సన్నాలు కొని మళ్ళీ మనకే సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందువలన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే పంటను అమ్మాలని సూచించారు.వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదని కావున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. తేమ 17శాతం ఉండాలని తెలియబర్చారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం పిఎసిఎస్ అధ్యక్షులు దీకొండ వెంకన్న,శ్రీరామగిరి పిఎసిఎస్ అధ్యక్షులు గుండా వెంకన్న, ఇనుగుర్తి మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్,పిఎసిఎస్ డైరెక్టర్ కొట్టం మహేందర్,ఎఎంసి డైరెక్టర్ కొట్టం రాము,మాజీ ఎంపిటిసి తమ్మడపెల్లి కుమార్,ఏఈఓ ముజాహిద్ ,జిల్లా నాయకులు బైరి అశోక్,చిన్నాల కట్టయ్య,గంజి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్లముల మురళి,తుమ్మనబోయిన సతీష్,మామిడి జనార్దన్, రావుల మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి,గండు అజయ్,పరుపాటి రామన్న,మాంకాళి సలీం,మీటు నాయక్ దేవులపల్లి వెంకన్న,చెట్టబోయిన యాకన్న, బూర ఇస్తారి ,పిఏసిఎస్ సిబ్బంది,మండల నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు, అధికారులు, గ్రామ హమాలీ లు , గ్రామ నాయకులు కార్యకర్తలు తదిపరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడి రాస లీలలు

- దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

**చర్ల, ఏఫ్రిల్ 18 (మనం న్యూస్) :** చర్ల మండలంలోని మారుమూల అటవీప్రాంత గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ ప్రాదమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విదులు నిర్వహిస్తున్న రమేష్ బాబు వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుని రాసలీలలు నిర్వహిస్తూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడటంతో గ్రామస్తులు దేహశుద్ధి చేసారు. గత ఏడాది అక్టోబర్ లో డిప్యూటేషన్ పై గ్రామంలోని పాఠశాలకు డిప్యూటేషన్ పై వచ్చిన రమేష్ బాబు ఒక విద్యార్థి తల్లితో అసభ్యంగా ప్రవర్తించ సాగాడు. కొన్నాల్లకు ఆమెను లొంగదీసుకొని అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. దీనిని గమనించిన గ్రామస్తులు వలపన్ని గురువారం సదరు ఉపాద్యాయుడిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఆగ్రహించిన గ్రామ యువకులు ఉపాద్యాయుడిని చితక బాదారు. అనంతరం పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి కుల తప్పు విదించారు. సదరు ఉపాద్యాయుడు వాజేడు మండలంలో విదులు నిర్వహించిన సందర్భంలోనూ తన కామవాంచను ప్రదర్శించడంతో అక్కడి జనం దేహశుద్ధి చేసి పంపారు. అనంతరం చర్ల మండలానికి బదిలీపై వచ్చి ఇక్కడ కూడా అదే తీరును ప్రదర్శించి అబాసుపాలయ్యాడు. ఐటిడిఏ అదికారులు ఈ విషయమై విచారించి ఉపాద్యాయుడిపై చర్య తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

# గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



**మధిర, ఏప్రిల్ 18(మనం న్యూస్):** ఖమ్మం మేత్రాసనం, బయ్యారం విచారణలో పవిత్ర శుక్రవారం ( గుడ్ ఫ్రైడే) సందర్భంగా బయ్యారం విచారణ గురువులు ఫాదర్ ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో సిలువ మార్గం , ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు పొందిన సిలువ శ్రమలను, పొందిన పాటులను గూర్చి తెలియజేస్తు మడుపల్లి ఆర్.సి.యం చర్చి నుండి బయ్యారం ఆర్.సి.యం చర్చి వరకు సిలువను మోస్తూ, సిలువను ఆరాధిస్తూ, ప్రదర్శనగా బహిరంగ సిలువ మార్గం నిర్వహించారు.ఏసు మరణం ప్రజల పాప విమోచనకు కారణమైన మరణం, కావున ఈ శుక్రవారాన్ని శుభదాయకం అని క్రైస్తవులు నమ్ముతారు, క్రీస్తు శ్రమలను తెలియజేస్తూ, క్రీస్తును ఆరాధిస్తు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలందరూ ఏసుక్రీస్తు మార్గంలో నడుస్తూ, సాటి వారి పట్ల ప్రేమ, గౌరవంతో ఉండాలని, శాంతి సమాధానంతో ఏసు ప్రేమలో జీవించాలని ప్రార్థించారు. ఈ సిలువ మార్గంలో బయ్యారం విచారణ పరిధిలో గల బయ్యారం,మడుపల్లి, దేశినేనిపాలెం, మహాదేవపురం, ఇల్లూరు, అల్లీనగరం, గోవిందాపురం గ్రామాల దీక్షాపరులు, సంఘస్తులు, సంఘ కాపరులు చిలకబత్తిని కిరణ్, చిలకబత్తిని కళ్యాణ్, గుంజా సునిల్ , విశ్వాసులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసనలు



**గార్ల, ఏప్రిల్ 18(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై గార్ల మండల ముస్లింలు స్థానిక జామ మజీద్ అధ్యక్షులు ఎండి. షఫీయుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం జామ మజీద్ ఎదురుగా బిల్లును వ్యతిరేకిస్తూ కుడి చెయ్యికి నల్ల రిబ్బన్ కట్టుకొని ప్లే కారడ్స్ తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు దానం చేసిన ఆస్తులతో సహా వక్ఫ్ ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకుని వాటిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తీవ్రంగా ఆరోపించారు. వక్ఫ్ బోర్డుల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే ఈ ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, కేంద్రం ఈ చట్ట సవరణను పునఃపరిశీలించి, వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో సెక్రెటరీ ఎస్.కె. బుడన్, వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రహీం ఖాన్, ఎండి ఖదీర్, జిలాని, జానీ, మౌలానా, మన్సూరలి, జానీ, హైమద్, సత్తార్, అబ్దుల్ హకీం, జబ్బార్, మౌలానా, పటాన్ మీరా, మునీర్, సలీం, అబ్జలి, షబ్బీర్ ఖాన్, అజారుద్దీన్, జాన్ కాన్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలుంటే దరఖాస్తు చేసుకోండి



- జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డా. శ్రీజ
- భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం
- చెరువు మాధారం, కొత్త కొత్తూరులో రెవెన్యూ సదస్సులు
- తనిఖీ చేసిన ఇంచార్జ్ కలెక్టర్

**ఖమ్మం(నేలకొండపల్లి), ఏప్రిల్ 18(మనం న్యూస్):** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. శుక్రవారం నేలకొండపల్లి మండలం చెరువు మాధారం, కొత్త కొత్తూరు గ్రామాలలో చేపట్టిన రెవెన్యూ సదస్సులను ఇంచార్జ్ కలెక్టర్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, నిర్వహిస్తున్న రిజిస్టర్లు, దరఖాస్తుదారులకు ఇస్తున్న రశీదు, ఏ ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నది పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకుంటున్న రైతులతో సమస్యలు అడిగి తెలుసుకుని, భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. చెరువు మాధారం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 160, కొత్త కొత్తూరు గ్రామానికి సంబంధించి 28 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ ప్రకారం మండలంలోని సదాశివపురం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం నుండి రెవెన్యూ సదస్సు నిర్వహించి 46 కు పైగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి, పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ అధికారి ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ తఫజ్జుల్ హుస్సేన్, నాయబ్ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐ లు శ్రీనివాస్, రవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సోనియా, రాహుల్ చూసి మోడీ భయపడుతున్నారు

- రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య




**భద్రాచలం, ఏప్రిల్ 18(మనం న్యూస్):** నేషనల్ హెరాల్ కేసులో ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జ్ షీట్లో చేర్చడాన్ని నిరసిస్తూ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కులగణన అడ్డుకోవడానికే సోనియా, రాహుల్ పై అక్రమ కేసుల పెట్టేందుకు బిజెపి ప్రభుత్వం సిద్ధపడుతుందని అన్నారు. రాహుల్ ని చూసి ప్రధాని మోడీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భయపడుతున్నది.దేశవ్యాప్తంగా ఈవీ మిషన్లు కాదు, బ్యాలెట్ పేపర్ కావాలన్న ఏఐసీసీ ప్లీనరీ నిర్ణయానికి బిజెపి భయపడుతున్నది.ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలే కాంగ్రెస్ ను గెలిపించుకుంటారు అని అన్నారు.దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబానికి దేశ ప్రజలు అండగా ఉన్నారు.భారతదేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి అఖిలభారత కాంగ్రెస్ పార్టీ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అని తెలిపారు.భారత దేశంలోని అన్ని మతాలను ఏకం చేస్తూ నడవాలన్న కాంగ్రెస్ అభీష్టాన్ని తిరగరాస్తు, ముస్లిం సోదరులకు అన్యాయం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును మొన్న పార్లమెంట్లో ప్రవేశపెట్టిన విషయమే దాన్ని తిరస్కరిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో తీర్మానం చేయడం పట్ల భయభ్రాంతులకు గురై కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు మీద కేసులు పెట్టడం జరుగుతుంది అని పేర్కొన్నారు.రేపటి నుంచి భద్రాచలం నియోజకవర్గం లో ఏఐసీసీ నిర్దేశించిన జై బాపు, జై భీమ్, జై సమేధాన్ కార్యక్రమం, శనివారం ఉదయం 9 గంటలకు భద్రాచలం పాత మార్కెట్ కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహం నుండి భద్రాచలం అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న డా:బీ ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కార్యక్రమం కొనసాగనుంది. ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తమ్ముళ్ల వెంకటేశ్వరరావు(టివి) చింతిరాల రవికుమార్, ప్రదీప్, వాసిరెడ్డి సాంబ, చింతరాల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ ఓ పథకం వరం

- శాసనసభ్యులు కూనంనేని
- కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ



**పాల్వంచ, ఏప్రిల్ 18(మనం న్యూస్):** పేదరికంలో తమ ఆడపిల్లలకు వివాహం చేయలేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులకు, ఆ ఇంటి ఆడపడుచులకు ప్రభుత్వం అమలుచేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం ఓ వరం లాంటిదని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకంక్రింద మంజూరైన 46 చెక్కులను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో లబ్దిదారులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలుచేసిన షాదిముబారక్, కల్యాణలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత మెరుగుపర్చి అమలుచేయడం అభినందనీయమన్నారు. పేద కుటుంబాలు, ప్రధానంగా మహిళల ఆర్థిక అవసరాలు గుర్తించి ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని, ఆరు గ్యారెంటి పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అతిత్వరలో పూర్తిస్థాయిలో ఈ పథకాలన్నీ అమల్లోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదకుటుంబాలు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, కనగాల అనంతరాములు, నూకల రంగారావు, బండి నాగేశ్వరరావు ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, డీ సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, మనేం వెంకన్న, వేములపల్లి రాజశేఖర్, భూక్యా విజయ, జకరయ్యా, బిక్కులాల్, కొంగర అప్పారావు, వల్లపు యాకయ్య, బానోత్ రంజిత్, మాడుపు ఉపేంద్ర చారి, వైఎస్ గిరి, ఆదినారాయణ, దుర్గా మహేష్, రాము, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



**నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 18(మనం న్యూస్):** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఈ చట్టంలోని అంశాలపై గ్రామాలలో విస్తృతంగా చర్చిస్తూ, తోటి రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.శుక్రవారం డిచ్పల్లి మండలంలోని నడిపల్లిలో, మోపాల్ మండల కేంద్రంలో గల రైతు వేదికలలో వేర్వేరుగా నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టం ద్వారా రైతులకు.చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశం వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం - 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాది కాలం లోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అవగాహన సదస్సుల అనంతరం మే మొదటి వారంలో అధికారులు గ్రామాల వారీగా సదస్సులను ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తారని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్ కు లేదా సీసీఎల్ఏ కు అప్పీల్ చేసుకోవచ్చని, ఈ చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా అందుబాటులో ఉంటుందని సూచించారు. ధరణి లో రెవెన్యూ కోర్టులను తొలగించడం వల్ల భూ వివాదాల విషయంలో రైతులు సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుత భూభారతి చట్టం ద్వారా ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులు పునరుద్ధరించిందని వివరించారు. భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని తెలిపారు. అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదని రైతులు భావిస్తే అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. ఆర్థిక స్థోమత లేని పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం కూడా సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం సరైంది కాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ల్యాండ్ ట్రిబ్యునల్ కు అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు.

కాగా, ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు చేస్తారని, దీని ద్వారా భూ ఆక్రమణలకు అవకాశం ఉండదని అన్నారు. ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు వెలువడనున్నాయని తెలిపారు. భూ భారతి చట్టం పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ సదస్సులలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, నిజామాబాద్ మార్కెట్ కమిటి చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డిచ్పల్లి మండల స్పెషల్ ఆఫీసర్ యోహాన్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# టీజీ ఈ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక



**నిజామాబాద్, ఏప్రిల్ 18( మనం న్యూస్):** తెలంగాణ ఉద్యోగ,గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక,, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ టి జిఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ మరియు రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ ఆదేశానుసారం... ఈ రోజు టీఎన్జీవో జిల్లా కార్యాలయం నందు, టీజీఈ జెఎసి జిల్లా నూతన కార్యవర్గ ఏర్పాటు సమావేశము అట్టహాసంగా నిర్వహించుకోగా... కార్యక్రమంలో భాగంగా మొదటగా టీజీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ మాట్లాడుతూ.. . గౌరవ టీజీఈ జెఎసి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు టీఎన్జీవోస్' జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ పేరును ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ పదవికి ప్రతిపాదించగా... టి జి ఈ జెఎసి భాగస్వామ్య సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులందరూ చప్పట్లతో, ముక్తకంఠంతో అంగీకరించగా, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. టి జి ఈ జెఎసి జిల్లా కన్వీనర్ గా టీజీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ , కో కన్వీనర్ గా పి ఆర్ టి యు మోహన్ రెడ్డి ని మరియు కో చైర్మన్ లు గా యు టి ఎఫ్, రమేష్ టి జి ఆర్ ఈ ఎస్ ఏ ఎల్ రమణ రెడ్డి ఎస్ టి యు ధర్మేందర్ క్లాస్ ఫోర్ అసోసియేషన్ శ్రీనివాస్ టిఆర్టిఎఫ్ కృష్ణారెడ్డి , టిపిటిఎఫ్ సురేష్ టి యు.యు రాము లతీకర్ గవర్నమెంట్ జేఎల్ఎస్ అసోసియేషన్ నర్సయ్య డి టి ఎఫ్ బాలయ్య , పెన్షనర్ అసోసియేషన్ రవీందర్ వైస్ చైర్మన్ గా టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ టీజీవో జిల్లా కార్యదర్శి సంఘం అమృత్ కుమార్ ఫైనాన్స్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అనంతరం రాష్ట్ర కమిటీ కూర్పు మేరకు జిల్లాలో కూర్పు ఏర్పరచుకొని, ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం రాష్ట్ర కమిటీ తెలిపిన 57 అంశాల ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి రాష్ట్ర నాయకత్వం ప్రకటించిన కార్యాచరణ ప్రకారంగా జిల్లాలో కూడా ఉద్యమాలు నిర్వహించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# ఐ.డీ.ఓ.సీ (కలెక్టరేట్)లో కంట్రోల్ రూం ఏర్పాటు



**నిజామాబాద్, ఏప్రిల్ 18( మనం న్యూస్):** జిల్లాలో ప్రస్తుత వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తినా, ధాన్యం అమ్మకాలలో రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు నెలకొని ఉంటే, వారు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 6644 కు ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చని అన్నారు. కంట్రోల్ రూమ్ కార్యాలయాల పని దినాలలో ప్రతి రోజు ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, నిర్ణీత వేళల్లో టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ధాన్యం అమ్మకాలు, తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే తెలుపవచ్చని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు వీలుగా కంట్రోల్ రూమ్ లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని అన్నారు.అదేవిధంగా, తాగునీటి సమస్య ఉన్నట్లయితే సెల్ నెంబర్ : 7382844951 కు, ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులు ఉంటే సెల్ నెంబర్ : 7382844769 కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చని కలెక్టర్ సూచించారు. మెయిల్ ద్వారా కూడా సమాచారం తెలియజేయవచ్చని అన్నారు. జిల్లా ప్రజలు, రైతుల సౌకర్యార్థం నెలకొల్పిన కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

# విజయవంతంగా ముగిసిన జాతీయ సేవా ప్రత్యేక శిబిరం



**భీంగల్ , ఏప్రిల్ 18(మనం న్యూస్):** భీంగల్ మండలం నలంద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గతవారం రోజుల నుండి బాబానగర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శుక్రవారం నాటికి ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కళాశాల ఆధ్వర్యంలో ప్రారంభం నుండి ముగింపు వరకు చేపట్టిన వివిధ జాతీయ సేవా కార్యక్రమాల గురించి వివరించారు.అలాగే వారం రోజుల నుండి జాతీయ సేవ కార్యక్రమాలు చేసిన కళాశాల విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంజీవ్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.అలాగే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో వ్యక్తిగత వికాసం సైబర్ క్రైమ్ ఎయిడ్స్ వంటి వ్యాధుల గురించి అనేక విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ. గత వారం రోజుల నుండి నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరానికి సహకరించిన గ్రామ వీడీసీ అధ్యక్షుడు సురేష్, మాజీ సర్పంచ్, వీడీసీ వారికి గ్రామస్తులకు సహకరించడంతో ఈ కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది. ప్రోగ్రాం సహకరించి కోఆర్డినేటర్ చేస్తూ సహకరించిన గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల రెస్పాండెంట్ వెంకట కిషన్,ఎంపీపీఎస్ హెడ్మాస్టర్ సుష్మ,కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్,సుధా, ప్రీతి, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

## కర్ణాటకలో 'రోహిత్ వేముల' చట్టం చేయాలి: రాహుల్ గాంధీ

**ఢిల్లీ,ఏప్రిల్ 18:** విద్యావ్యవస్థలో నేటికీ బలహీన వర్గాలు కుల వివక్షను ఎదుర్కొంటున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దళిత విద్యార్థులెవరూ అటువంటి వివక్షను ఎదుర్కోకుండా ఉండాలంటే 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించి.. అమలు చేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాశారు. నేటికి కూడా మన విద్యావ్యవస్థలో దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం సిగ్గుచేటని రాహుల్ పేర్కొన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ జీవితంలో ఎదుర్కొన్న కుల వివక్ష గురించి ఈ లేఖలో రాసుకొచ్చారు. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేడ్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవడానికి సిద్ధరామయ్య కృషి చేస్తారని తాను నమ్ముతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వీ, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారని.. ఇకనైనా ఇటువంటి హత్యలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ అన్నారు. 2016 జనవరి 17న హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడు. యూనివర్సిటీ అధికారులు, ఇతర విద్యార్థి సంఘాల వేధింపుల కారణంగానే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని దళిత సంఘాలు దేశవ్యాప్తంగా ఉద్యమించాయి. విద్యాసంస్థల్లో దళిత విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రోహిత్ చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. అతడు ఆత్మహత్య చేసుకున్న ఎనిమిదేళ్ల తర్వాత మృతుడి తల్లి విజ్ఞప్తి మేరకు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసుపై పునర్విచారణ ప్రారంభించింది.

# ఢిల్లీ పరిపాలనకు తమిళనాడు తలొగ్గదు: స్టాలిన్



**చెన్నై,ఏప్రిల్ 18:** ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం తమిళనాడులో కుదరదని ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు.

తమిళనాడులో 2026లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ స్పందించారు. దిల్లీ పరిపాలనకు లొంగని ప్రత్యేకత తమిళనాడుకు ఉందని.. భాషా వివాదం నేపథ్యంలో ఇప్పటికే ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ఇక్కడ కుదరదని వ్యాఖ్యానించారు. 2026 ఎన్నికల్లో కూడా తమ పార్టీనే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

తమిళనాడుకు నీట్ నుంచి మినహాయింపు ఇస్తామని.. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయబోమని అమిత్ షా హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. డీలిమిటేషన్ (పార్లమెంటరీ ఎన్నికల్లో)తో సీట్లను తగ్గించమని చెప్పగలరా అని నిలదీశారు. ఇటీవల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడు ప్రజలను కించపరిచేలా మాట్లాడారని.. అమిత్షా సైతం అదే విధమైన వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారమే కేంద్రం, రాష్ట్రాలు ఏర్పాటయ్యాయని.. ఎవరూ ఎవరికి సబార్డినేట్ కాదని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేర్కొన్నారని పునరుద్ఘాటించారు.

వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేయనుంది. 2026లో తమిళనాట అధికారంలోకి వస్తామని భాజపా అగ్రనేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా.. జాతీయ విద్యలో త్రిభాషా సూత్రం, డీలిమిటేషన్ మొదలైన విషయాలపై తమిళనాడు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో తీవ్రంగా తలపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం.. కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై విస్తృతంగా పోరాటం చేస్తోంది.

దీని కోసం ఇటీవల ఆయన ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాల స్వయం సాధికారత కోసం అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తుందని తెలిపారు. రాష్ట్రాల చట్టబద్ధ హక్కులను పరిరక్షించడంతోపాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను మెరుగుపరచడమే ఈ కమిటీ లక్ష్యమని స్టాలిన్ వివరించారు.

# వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా బోధన్ లో ముస్లింల నిరసన


**బోధన్, ఏప్రిల్ 18 (మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బోధన్లో ముస్లిం సమాజం శుక్రవారం నిరసన చేపట్టింది. జుమ్మా నమాజు అనంతరం భారీ




సంఖ్యలో ముస్లింలు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని శాంతియుతంగా ఆందోళన చేపట్టారు.వారి తరఫున మత పెద్దల నేతృత్వంలో ఒక వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు అందజేశారు. వక్ఫ్ బిల్లులోని పలు నిబంధనలు ముస్లింల హక్కులను హరించేందుకు దారి తీసే విధంగా ఉన్నాయని వారు ఆరోపించారు. ఫ్లెక్సీలు, ప్లకార్డులు ధరించి 'వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిల్లును దేశవ్యాప్తంగా ముస్లిం సమాజం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే పోరాటం ముమ్మరంగా మారుతుందని హెచ్చరించారు.వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా కొత్త బిల్లును తేవాలని కోరుతూ వారు విజ్ఞప్తి చేశారు.

## జేఈఈ (మెయిన్) సెషన్-2 ఫైనల్ కీ విడుదల..

**ఢిల్లీ, ఏప్రిల్ 18:** జేఈఈ (మెయిన్) సెషన్- 2 పరీక్షల తుది కీమళ్లీ విడుదలైంది. తొలుత గురువారమే జేఈఈ (మెయిన్) రెండో సెషన్ పేపర్ -1కు సంబంధించిన తుది కీని జాతీయ పరీక్షల మండలి(ఎన్టీఏ)విడుదల చేసినప్పటికీ.. కొద్దిగంటల్లోనే తొలగించింది. ఇందుకు కారణమేంటో




తెలపకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర గందరగోళానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఎన్టీఏ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం మరోసారి తుది కీని విడుదల చేసిన ఎన్టీఏ.. ఫిజిక్స్లో రెండు ప్రశ్నలను (ఐడీలు: 347577562, 347577939) విరమించుకున్నట్లు పేర్కొంది. మరోవైపు, జేఈఈ మెయిన్ పరీక్షల షెడ్యూల్లో పేర్కొన్న ప్రకారం ఏప్రిల్ 17 నాటికి ఫలితాలు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ.. నిర్ణీత గడువులోగా రిజల్ట్స్ ఇవ్వడంలోనూ ఎన్టీఏ విఫలమైందంటూ విమర్శలు వస్తున్నాయి. దీంతో శుక్రవారం ఉదయం స్పందించిన ఎన్టీఏ.. శనివారం లోగా ఫలితాలు విడుదల చేయనున్నట్లు 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. అలాగే, ఈ మధ్యాహ్నం 2గంటల కల్లా తుది కీ విడుదల చేస్తామని ప్రకటించడంతో విద్యార్థులు ఎదురుచూశారు. అయితే, తుది కీని సైతం చెప్పిన సమయం కన్నా గంటకు పైగా ఆలస్యంగా విడుదల చేయడంతో ఎన్టీఏ అధికారుల తీరుపై పలువురు నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

# అమెరికా ప్రయాణమా..? జాగ్రత్త

**వాషింగ్టన్, ఏప్రిల్18:** అమెరికాలో ఇటీవల కాలంలో తనిఖీలు భారీగా పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) ఆఫీసర్లు ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్, అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ పలు విషయాలతో ఎఫ్ఏక్యూ (తరచుగా అడిగే ప్రశ్నలు)ను జారీ చేశాయి. దీంతోపాటు సీబీపీ ఆఫీసర్లు ప్రయోజనకర సమాచారాన్ని వెబ్సైట్లో ఉంచారు. ఇవి కేవలం వీసాదారులకే కాదు.. గ్రీన్కార్డు హోల్డర్స్, అమెరికా పౌరులకు కూడా వర్తిస్తాయి. కాకపోతే వారి హోదాను బట్టి హక్కులు మారుతుంటాయి. అమెరికాలో ప్రవేశించేవారి వద్ద ఉండే ఫోన్లు, ల్యాప్టాప్, టాబ్లెట్లు, ఇతర గ్యాడ్జెట్లను తనిఖీ చేయడానికి సీబీపీ సిబ్బందికి అధికారం ఉంది. దేశంలోకి ప్రవేశించే ప్రదేశాల్లో, ఎయిర్ పోర్టుల్లో, నౌకాశ్రయాల్లో ఈ చెకింగ్స్ ఉంటాయి. ఇందుకోసం ఎటువంటి వారెంట్ అవసరం లేదు.



ఈ తనిఖీలు రెండు రకాలుగా ఉంటాయి. తొలుత మనం ఫోన్ వంటి వాటిని అన్లాక్ చేసి లేదా పాస్వర్డ్ చెప్పి ఇవ్వాల్సి ఉంటుంది. వీటిని అక్కడే చెక్ చేస్తారు. మరింత స్పష్టత కోసం ప్రత్యేకమైన పరికరాలు వాడి వాటిని తనిఖీ చేయవచ్చు. వాటిల్లో కంటెంట్ను కాపీ చేయడం లేదా విశ్లేషణ చేస్తారు. ఇక వారికి చట్ట వ్యతిరేకమైనవి లేదా జాతీయ భద్రతకు సంబంధించినవి ఆ పరికరాల్లో ఉన్నాయని అనిపిస్తే అడ్వాన్స్ సెర్చ్ నిర్వహిస్తారు. ఇందుకోసం సీనియర్ మేనేజర్ అనుమతి తీసుకొంటారు. కొన్ని సందర్భాల్లో సీబీపీ అధికారులు మీరు ఎయిర్ పోర్టు నుంచి బయటకు వెళ్లేలోపు మీ పరికరాలు వాపస్ కూడా ఇవ్వకపోవచ్చు. అదనపు తనిఖీల కోసం ఐదు రోజులు వారివద్దే ఉంచుకోవచ్చు. ఆ తర్వాత అవసరమైతే మరో వారం చొప్పున పొడిగించుకుంటూ వెళ్లొచ్చు. గతంలో కొన్ని వారాలపాటు ప్రయాణికుల పరికరాలను సీబీపీ అధికారుల వద్దే ఉంచుకొన్న ఘటనలు ఉన్నాయి. అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ ప్రకారం ఇలాంటి పరిస్థితుల్లో ప్రయాణికులు సీబీపీ అధికారి పేరు, బ్యాడ్జి నెంబర్ను నోట్ చేసుకోవాలి. వారు అడిగిన ప్రశ్నలను జాగ్రత్తగా రాసుకోవాలి. ఒకవేళ ప్రయాణికులను అధికారులు ప్రశ్నిస్తున్నప్పుడు రికార్డు చేస్తే.. ఆ ట్రాన్స్క్రిప్ట్ కాపీ అడగాలి. పౌరులు కాని వారికి ఈ విషయంలో తక్కువ హక్కులు ఉంటాయి. డివైజ్లను అన్లాక్ చేయడానికి అంగీకరించకపోతే.. వీసాదారులను ఒక్కోసారి అమెరికాలోకి అడుగుపెట్టనీయకపోవచ్చు. ఇక గ్రీన్ కార్డుదారులకు ఇమిగ్రేషన్ జడ్జి ఎదుట వాదనలు వినిపించే హక్కు ఉంటుంది. ఇక పౌరులను దేశంలోకి రాకుండా అడ్డుకొనే అవకాశం లేదు. కానీ, ఆ పరికరాన్ని సీజ్ చేయవచ్చు.

అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ ఈ విషయంలో ఓ సూచన చేసింది. వీసాదారులు తమ పాస్వర్డ్ను అధికారులకు చెప్పే బదులు తామే డివైజ్ను అన్లాక్ చేసి ఇవ్వాలని పేర్కొంది. ఒకవేళ అది సాధ్యం కాకపోతే.. వారి డివైజ్ తిరిగి చేతికి వచ్చిన వెంటనే పాస్వర్డ్ మార్చుకోవాలని సూచించింది.

మీ పరికరాన్ని స్వాధీనం చేసుకొంటే ఏం చేయాలి..?

ఒకవేళ మీ పరికరాన్ని సీజ్ చేస్తే.. ఫామ్ 6051-డి రశీదును కచ్చితంగా తీసుకోవాలి. దీనిలో ఆ పరికరం వివరాలు మొత్తం ఉంటాయి. మీరు తర్వాత ఎక్కడ సంప్రదించాలో వెల్లడిస్తారు. సాధారణంగా పరీక్షలు పూర్తయ్యాక ప్రయాణికుడి వద్దకు దానిని చేరుస్తారు.

మీ పరికరంలో ఎటువంటి నేరాలకు సంబంధించిన ఆధారాలు లేవని నిర్ధరించుకొన్నాక.. దానినుంచి కాపీ చేసిన సమాచారాన్ని అధికారులు 21 రోజుల్లోపు నాశనం చేస్తారు. ఒక్కో సందర్భంలో సీబీపీ అధికారులు మిమ్మల్ని తనిఖీ చేసినప్పటి వివరాలు నమోదు చేసుకొని భద్రపరుస్తారు. మీరు తిరిగి వచ్చిన సందర్భంలో డిజిటల్ పరికరాల సాఫ్ట్వేరు వంటి వాటిల్లో చేయకూడని మార్పులు ఏమైనా జరిగాయేమో కూడా స్కాన్ చేస్తారు.

అమెరికాకు వెళ్లే సమయంలో ప్రయాణాల కోసమే ఉద్దేశించిన పరికరాలను వాడాలని నిపుణులు చెబుతున్నారు. వీటిల్లో తక్కువగా వ్యక్తిగత సమాచారం ఉండేట్లు చూసుకోవాలి. వ్యక్తిగత సమాచారం ఉండే సున్నితమైన యాప్ల నుంచి సైన్ ఔట్ కావాలి. ఆటోలాగిన్ ఆప్షన్ను డిజేబుల్ చేయాలని చెబుతున్నారు. దీంతోపాటు వ్యక్తిగత పరికరాల్లో కీలక డేటా, ఫైల్స్ బ్యాకప్ను డ్రైవ్లో భద్రపర్చుకోవాలి. సీబీపీ అధికారులు డివైజ్లో ఉన్న డేటాను మాత్రమే పరిశీలిస్తారు. క్లౌడ్ వంటి రిమోట్ విధానంలో భద్రపర్చిన డేటాను పరిశీలించరని నిపుణులు చెబుతున్నారు.

## 22 మంది మావోయిస్టుల లొంగుబాటు



**దంతెవాడ, ఏప్రిల్ 18:** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. వారిలో 12 మందిపై రూ.40 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. అమానవీయ మావోయిస్టు భావజాలం, స్థానిక గిరిజనులపై జరిగిన దురాగతాలతో నిరాశ చెందామని పేర్కొంటూ తొమ్మిది మంది మహిళలు సహా 13 మంది మావోయిస్టులు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్సెస్ (సీఆర్పీఎఫ్) సీనియర్ అధికారుల ముందు లొంగిపోయారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. వీరంతా పలు హింసాత్మక, విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నారని పోలీసులు చెప్పారు. గతేడాది సుక్మాతో సహా బస్తర్ ప్రాంతంలో దాదాపు 792 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ ఐడి కార్డులు తీసుకోవాలి




- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ

కర్నూలు, ఏప్రిల్ 18మనం న్యూస్ : నగరంలో వయో వృద్ధులు ఐడి కార్డులు తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 60 ఏళ్ళు పైబడిన పురుషులు, 50 ఏళ్లు పైబడిన మహిళలు సీనియర్ సిటిజన్స్గా పరిగణించబడతారని, వారు తమ సచివాలయాల్లో ఐడి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజు ఫోటో, రూ.40 రుసుము చెల్లిస్తే ఐడి కార్డు మంజూరు అవుతుందని, దీని ద్వారా రవాణా సమయంలో, వివిధ సందర్భాల్లో క్యాలైన్లు, ఇతరత్రా సమయాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని, కావున వయో వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీవీ కోరారు.

# తమ్మి రెడ్డి వారి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు

- ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి
- బదినెహాల్ లక్ష్మిరెడ్డి

కౌతాళం, ఏప్రిల్ 19(మనం న్యూస్): రావు సాహెబ్ బదినేహాళ్ తమ్మిరెడ్డి వారి సత్రం కమిటీ సౌజన్యంతో మండల గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆసక్తి గలవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని బదినెహాల్ లక్ష్మిరెడ్డి మరియు పద్మావతమ్మ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఆదోనిలో రావు సాహెబ్ బాధినేహాల్ తమ్మిరెడ్డి వారి సత్రం భవనం పెద్ద పోస్ట్ ఆఫీస్ ముందు ఉచిత కంటి పరీక్షలు ఆపరేషన్ మరియు గుండె,కిడ్నీ వైద్య పరీక్షలు ఏప్రిల్ 30 వ తేదీన ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ఆధార్ కార్డు. ఆరోగ్యశ్రీ కార్డు, తెల్ల రేషన్ కార్డు,రెండు పాస్పోర్ట్ ఫోటోలు,మరియు వారి దగ్గర ఉన్న సెల్ ఫోన్ నెంబర్ కాంటాక్ట్ నెంబర్ ఏప్రిల్ 28,,29 లోపల నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ వైద్య శిబిరంలో ఉచిత కిడ్నీ వైద్య పరీక్షలు బీపీ,షుగర్, సిబిపి, సి యు సి,ఉచితంగా గుండె పరీక్షలు ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ, టుడి






ఎకో,టిఎంటి, గల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే వైద్య నిపుణులచే ఉచితంగా కంటి పరీక్షలు చేయబడును కంటి ఆపరేషన్లు అవసరమైనచో వారికి అత్యాధునికమైన లెన్స్ కూడా ఉచితంగా అమర్చబడును శిబిరంలో కంటి ఆపరేషన్ అవసరమైన వారికి అదే రోజు నంద్యాలలో తీసుకెళ్లి శాంతిరం హాస్పిటల్ నందు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయబడును ఆ ప్రశ్న కొరకు వెళ్లిన వారికి నంద్యాలలో భోజనము వసతి ఇతర సౌకర్యములు ఉచితంగా కల్పించబడును. అని పేర్కొన్నారు.. ఆప్తో మెట్రిస్ట్ శాంతిరాం ఆస్పత్రి నంద్యాల సిబ్బంది.. 9980269622... 06361707972 ..09916665347 ఈ నెంబర్ల తో పాటు విశ్వనాథ్ రెడ్డి 9849679001 కు సంప్రదించాలని కోరారు.

## వర్షపు నీరు నిలవకుండా చర్యలు



కర్నూలు, ఏప్రిల్ 18(మనం న్యూస్): నగరంలోని అశోక్ నగర్ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కింద వర్షం పడినప్పుడు నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు తెలిపారు. శుక్రవారం అక్కడ జరుగుతున్న మురుగు కాలువల పునరుద్ధరణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటివల వర్షం కురిసినప్పుడు అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచి, వాహనదారులు ఇబ్బంది పడుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజి భరత్ దృష్టికి వచ్చిందని, అప్పుడే తక్షణమే తాత్కాలిక పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 25 మంది ప్రత్యేక సిబ్బందితో చర్యలు చేపట్టామని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్ష అధికారి నాగరాజు, తనిఖీదారుడు రాఘవేంద్ర, పాల్గొన్నారు.

## మెళగనూర్ గ్రామంలో అకాల వర్షం ఆపార నష్టం

కౌతాళం, ఏప్రిల్ 18 (మనం న్యూస్): కౌతాళం మండల పరిధిలోని మెళగనూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం భారీ ఇదురుగాలులతో కూడిన వడగండ్లు వర్షం పడి గ్రామంలోనే ఈ వర్షానికి కొన్ని గుడిసెలలు పై కప్పు ఎగిరిపోవడం జరిగింది.మరియు చెట్లు భారీ గాలి బీభత్సానికి విరిగిపోయాయి. అలాగే వానకు దెబ్బతిన్న వరి పంటలు కావున నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయవలసిందిగా గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.



### ధర్మ పరిరక్షణ ధ్యేయంగా పలువురికి
## ఆదర్శంగా నిలిచిన ఆచార్యులు



సుల్తానాబాద్, ఏప్రిల్ 18 (మనం న్యూస్): సత్ సంప్రదాయ పరిరక్షణ సభ పేరిట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో పాటు దక్షిన భారతదేశంలోని అనేకమంది పండితులకు శిక్షణ ఇచ్చిన మహనీయుడు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాస రఘునాథ ఆచార్యులవారనీ సుల్తానాబాద్ వికాస తరంగిణి కోఆర్డినేటర్ సాదుల సుగుణాకర్ అన్నారు. ఆచార్య రఘునాథచార్యుల శత తిరునక్షత్ర జయంతి వేడుకలను పురస్కరించుకొని సుల్తానాబాద్ పట్టణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.. వికాస తరంగిణి ప్రజ్ఞ కోఆర్డినేటర్, రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల వనజ వెంకటరమణ దంపతుల నివాసంలో శుక్రవారం రఘునాథ చారుల వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఆయన ధర్మ పరిరక్షణ కోసం సంప్రదాయ పరిరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలను, వారు రచించిన గ్రంథాలను ప్రస్తావిస్తూ ఆయన సేవలను కొనియాడారు. రఘునాథ ఆచార్యుల వారి శతజయంతి ఉత్సవాల పురస్కరించుకొని ఈనెల 20న వరంగల్లో ఏర్పాటు చేస్తున్న సభలో చిన్న జీయర్ స్వామి వారు పాల్గొంటున్నారని పలువురు పండితులకు రఘునాథ చార్ల వారి పురస్కారాలను ప్రదానం చేస్తారని సుగుణాకర్ తెలిపారు అనంతరం పలువురు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అన్నమనేని సప్న, సుగుణ, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సునీత, చిట్టక్క తదితరులు పాల్గొన్నారు.

## ఓర్వకల్లు గ్రీన్ కో ప్రాజెక్టును పరిశీలించిన కేంద్ర మంత్రి

కర్నూలు ఏప్రిల్ 18మనం న్యూస్: ఓర్వకల్లు మండలం గని సమీపంలో ఉన్న సోలార్ పార్క్, గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్, విండ్ పవర్ ప్రాజెక్ట్ లను హెలికాప్టర్ ద్వారా పరిశీలించిన అనంతరం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అప్పర్ ఇన్ టేక్ పాయింట్ రిజర్వాయర్ నుండి నీటిని పైపు ల ద్వారా ట్బన్ ల వరకు సరఫరా చేసే విధానాన్ని పరిశీలించారు.. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు పాణ్యం ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరిత వెంకటరెడ్డి వెంకటరెడ్డి తో పాటు గ్రీన్ కో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ గ్రీన్కో ఇంటిగ్రేటెడ్ రెమాట్లాడుతూఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్ట్ యొక్క వేగవంతమైన పురోగతిని



ప్రశంసించారు.ప్రపంచంలోనే మొట్టమొదటి మరియు అతిపెద్ద రకమైన ప్రాజెక్ట్ గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ మన దేశంలో ఉండడం గర్వకారణం అన్నారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వంలో భారతదేశం యొక్క గ్రీన్ ఎనర్జీ సామర్థ్యానికి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ అన్నారు.. ఈ మార్గదర్శక ప్రయత్నాన్ని సాధ్యం చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను అన్నారు. గ్రీన్ కో సంస్థ ఎండి చలమలశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత, ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధిని పెంచుతుందని, అనుబంధ పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని అదే విధంగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు.. స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి, నిల్వ మరియు డిమాన్ప సరఫరా కోసం రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్ భారతదేశ ఇంధన భద్రతను పెంచడంలో మరియు పర్యావరణ అనుకూల వనరులకు పరివర్తనను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.. కార్యక్రమంలో గ్రీన్ కో సంస్థ ఎండి చలమలశెట్టి అనిల్ కుమార్, కర్నూలు బిజెపి జిల్లా ఇన్చార్జి అంకాల రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వక్స్ సవరణ చట్టాని వెనక్కి తీసుకోవాలి

- సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి




నల్లగొండ- ఏప్రిల్ 18( మనం ప్రతినిధి ): కేంద్రంలోమోడిప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్స్ బోర్డు సవరణ చట్టం మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని వెంటనే చట్టం సవరణను వెనక్కి తీసుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి కేంద్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సిపిఐ నల్లగొండ జిల్లా సమితి కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్థానిక మగ్దుం భవన్ లో జరిగింది . సమావేశానికి పల్లా వెంకట రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వక్స్ బోర్డు సవరణ చట్టంనికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉన్న ప్రజా స్వామ్యవాదులు, మేధావులు, ఉద్యమకారులను అన్నివర్గాల ప్రజలు కేంద్రప్రభుత్వ నిరంకుశ వైఖరికి పోరాటాల ద్వారా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి సంపన్న వర్గాలకు దేశ సంపదను కట్టబెట్టడం కాకుండా వారికి అనుకూలమైన చట్టాలను తీసుకొచ్చి పేద ప్రజల పై ధరలు పనుల భారం మోపుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో ఒకవైపు రేవంత్ రెడ్డి ప్రభుత్వం 500 రూపాయలు గ్యాస్ పై రాయితీ ఇస్తుంటే కేంద్రప్రభుత్వం 50 రూపాయలు గ్యాస్ ధర పెంచడం సిగ్గుచేటు అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని ఎత్తివేసి భూ భారతి తీసుకురావడం జరుగుతుందని ఈ భూ భారతి ద్వారా నైనా కొన్ని ఏళ్ల నుండి ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

### వరి ధాన్యం కొనుగోలు వేగమంతం చేయాలి :ఏ మ్మెల్సీ నెల్లికంటి సత్యం

వాతావరణం మార్పుల వల్ల వడగాలులతో కురుస్తున్న అకాల వర్షాల వలన ఆరుగాలాలు రైతులు కష్టపడి పండించిన పంటలు పూర్తిగా దెబ్బతినిపోయాయని వెంటనే సర్వే చేసి నష్ట పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఏ మ్మె ల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యం కొనుగోలు వేగమంతం చేయాలన్నారు. సిపిఐ గ్రామ శాఖ, మండల సమితి మహాసభలు మే, జూన్ మాసంలో జిల్లా వ్యాప్తంగా ఉత్సాపూరితంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి,ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి లోడంగి శ్రవణ్ కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,ఆర్ అంజయ్య చారి, బులుగూరి నరసింహ,టి వెంకటేశ్వర్లు,నలపరాజు రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం నూతన భవనం ప్రారంభం




- దొడ్డి కొమరయ్య ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలి
- తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 18(మనం న్యూస్ ): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి వార్డులో నూతనంగా నిర్వహించిన కురుమ సంఘం భవనాన్ని ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం నూతన భవనంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, తెలంగాణ హక్కుల సాధనకు విశేష కృషి చేసిన దొడ్డి కొమురయ్య మనందరికీ ఆదర్శం అన్నారు .అనిరజాకార్లను గ్రామాల్లోకి రాకుండా, దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దుడ్డుకర్రల సంఘం పెట్టి పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ చేవెళ్ల సీనియర్ నాయకులు దేశముల ఆంజనేయులు , దేవుని ఎర్రవల్లి కురుమ సంఘం అధ్యక్షుడు కరికే సత్యనారాయణ సంఘం ఉపాధ్యక్షులు అంగరెల్లి రాజు, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, మాజీ సర్పంచ్ కంకంటి శ్యామలయ్య, చంద్రయ్య, మల్లేష్, పత్తి సత్యనారాయణ, ఎదురే రాములు,కరికే శ్రీనివాస్, వెంకటరెడ్డి, నరసింహ, నవీన, రవి పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్లాపూర్, ఏప్రిల్ 18 ( మనం న్యూస్): మండలంలోని కుస్తాపూర్, రత్నాపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో. నిర్వహిస్తున్న వరిధాన్య కొనుగోలు కేంద్రాలను శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి అమ్ముకోవాలన్నారు. దళారీలకు విక్రయించి మోసాలకు గురికావద్దని ఆయన తెలిపారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకుండా సంబంధిత



అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## సుక్మా జిల్లాలో 22 మంది మావోయిస్టుల లొంగుబాటు



చర్ల, ఏప్రిల్ 18 (మనం న్యూస్) : ఛత్తీస్ఘడ్లో మావోయిస్టులకు గట్ట ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లతో సహచరులను కోల్పోతున్న మావోయిస్టులకు లొంగుబాట్లు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్ర నిర్బంధం నేపథ్యంలో నిత్యం పదుల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. తాజాగా శుక్రవారం సుక్మా జిల్లాలో 40 లక్షల రివార్డు కలిగిన 22 మంది మావోయిస్టులు జిల్లా ఎస్ పి కిరణ్ చవాన్ ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో 9 మంది మహిళలు, 13 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారంతా మాడ్ డివిజన్ కమిటీకి చెందిన వారని ఎస్ పి వెల్లడించారు. సుక్మా జిల్లాలో ప్రవేశ పెట్టిన నెల్ నార్ పథకం పట్ల ఆకర్షితులై వారంతా జనజీవన స్రవంతిలో కలిసారని ఎస్ పి తెలిపారు. లొంగిపోయిన వారందరికీ పునరావాస పథకం క్రింద ఆర్థిక సహాయం అందచేయనున్నట్లు తెలిపారు.

## వడ్ల కల్లాలు ఒకచోట ఐకెపి సెంటర్ మరోచోట

- కింటాకి మూడు కిలోలు తరుగు తీస్తున్నారని వాపోతున్న రైతులు
- వ్యాలిడిటీ అయిపోయిన మ్యాచర్ మిషన్లు



కోదాడ,ఏప్రిల్18(మనం న్యూస్): కోదాడ నియోజకవర్గం పరిధిలోని ఐకెపి సెంటర్లను స్థానిక బిజెపి నాయకులు శుక్రవారం పరిశీలించి రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ మాట్లాడుతూ కోదాడ రూరల్ పరిధిలోని చిమిర్యాల నల్లబండగూడెం కాపుగల్లు గణపవరం గ్రామాలలో గల ఐకెపి సెంటర్లను పరిశీలించామని అంతేకాకుండా మోతే నడిగూడెం మండలాలలో పరిశీలించామని అన్నారు.రైతులు తెలిపిన వివరాల ప్రకారం సెంటర్లో చాలా స్లోగా నడుస్తున్నాయని వాతావరణంలో వచ్చిన మార్పుల వలన రైతులం ఆందోళనకు గురవుతున్నామని అన్నారని అన్నారు. దొడ్డు రకం వడ్లను ఇంతవరకు ఐకెపి సెంటర్లు కొనుగోలు చేయట్లేదని ఏంది అని అడిగితే ట్యాబులు పనిచేయట్లేదు అని సమాధానాలు చెబుతున్నారని రైతులు తెలిపారని అన్నారు. 40 కేజీల బస్తాకు 41 కేజీ 200 గ్రాములు కాంటా వేస్తున్నారని మళ్లీ కింటాకు తరుగు అని మూడు కేజీలు తీస్తున్నారని రైతుల తెలిపారని అన్నారు. నడిగూడెం మండల కేంద్రంలో రైతుల కల్లాలు ఒకచోట ఐకెపి సెంటర్ మరొకచోట పెట్టారని రైతులు పోతున్నారని అన్నారు.రైతులకు బస్తాలు ఇవ్వడంలో కూడా సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారని అన్నారు. ఇప్పటికే రెండుసార్లు వర్షం వచ్చి రైతులు నానా ఇబ్బందులు పడ్డారని మూడోసారి వర్షం వస్తే వడ్లు దేనికి పనికి రావని రైతులు వాపోతున్నారని అన్నారు. తాలు ఎక్కువగా ఉందని తూర్పాల పోయాలని రైతులకు సంబంధిత ఐకెపి అధికారులు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని రైతులకు సరైన సమయంలో బస్తాలు ఇచ్చి రైతులకు ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మల్లెబోయిన వెంకటేష్ బాబు,కోదాడ రూరల్ మండల అధ్యక్షులు దేవరశెట్టి సత్యనారాయణ, మోతే అధ్యక్షులు శంకర్ నాయక్,మునగాల అధ్యక్షులు కృష్ణ ప్రసాద్,కోదాడ రూరల్ ఉపాధ్యక్షులు బూమా శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి గాదరి పుల్లారావు,దళిత మోర్చా నాయకులు గుండెపంగు సైదులు,రామారావు పాల్గొన్నారు.

## పోచంపల్లి మినీ ట్యాంక్ బండ్ కి శంకుస్థాపన



భూదాన్ పోచంపల్లి,ఏప్రిల్ 18 (మనం న్యూస్): భూదాన్ పోచంపల్లి పెద్ద చెరువు ని మినీ ట్యాంక్ బండ్ గా మార్చేందుకు భువనగిరి శాసనసభ్యు లు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచంపల్లిని సుందరీకరణ లో భాగంగా పోచంపల్లి చెరువును మినీ ట్యాంక్ పండుగ మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిం దని అందులో భాగంగానే మినీ ట్యాంక్ బండ్కు శంకుస్థాపన చేస్తున్నామని త్వరలోనే పనులు కూడా పూర్తవుతాయని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తడక వెంకటేష్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భారత లవ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్,పదవ వార్డు మాజీ కౌన్సిలర్ మోటే రజిత రాజు,పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధన కార్యదర్శి గునిగంటి వెంకటేష్ గౌడ్,మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి,కిసాన్ సెల్ నాయకులు మరీ నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుక్క కుమార్,మోటే మహేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గ్యార సందీప్, యువజన కాంగ్రెస్ నాయకులు జింకల జయసూర్య, పెంట నవీన్ పదవ వార్డ్ అధ్యక్షులు చేరల మహేందర్, వంగూరి రాము పాల్గొన్నారు.






# నీరజ్.. 84.52 మీ. త్రోతో

భారత జావెలిన్త్రో స్టార్ నీరజ్ చోప్రా కొత్త సీజన్లో శుభారంభం చేశాడు. దక్షిణాఫ్రికాలో పొచెఫ్స్ట్రూమ్ లో జరిగిన పోచ్ ఆహ్వానిత ట్రాక్ ఈవెంట్లో అతడు అత్యుత్తమంగా 84.52 మీటర్ల త్రోతో విజేతగా నిలిచాడు. దక్షిణాఫ్రికా ప్లేయర్లు డౌ స్మిట్ (82.44 మీ) రెండు, డంకన్ రాబర్ట్ సన్ (71.22 మీ) మూడో స్థానాలు దక్కించుకున్నారు. జర్మనీ కోచ్ క్లాస్ బార్టోనిజ్ తో నీరజ్ ఒప్పందం గతేడాదే ముగియడంతో కొత్త కోచ్ జాన్ జేన్లీ (చెక్ రిపబ్లిక్) దగ్గర శిక్షణ పొందుతున్నాడు. మే 16న మొదలయ్యే దోహా డైమండ్ లీగ్ పై ఇక అతడు దృష్టి సారించనున్నాడు. 2024 పారిస్ ఒలింపిక్స్ లో 89.45 మీటర్ల త్రోతో నీరజ్ రజతం గెలిచాడు. ఇప్పటిదాకా కెరీర్ లో అత్యుత్తమంగా 89.94 మీటర్ల దూరం విసిరిన ఈ భారత స్టార్.. కొత్త సీజన్లో 90 మీటర్ల మార్కును చేరుకోవాలనే సంకల్పంతో ఉన్నాడు.



# శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఇండియన్ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్

**తిరుమల,ఏప్రిల్ 18,మనం న్యూస్:** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మాజీ ఇండియన్ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం వేకువ జామున స్వామివారి అభిషేకం సేవలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



# ప్రతి బ్యాట్కు పరీక్ష

ఐపీఎల్-18లో భారీ బ్యాట్లపై కొరడా ఝుళిపిస్తున్నారు. బ్యాటు, బంతి మధ్య సమతుల్యతను కాపాడటం, భారీ బ్యాట్లతో బ్యాటర్లు అదనపు ప్రయోజనం పొందకుండా ఉండేందుకు ఐపీఎల్ పాలక మండలి ఈ నిర్ణయం తీసుకుంది. అందుకే నిర్ణీత సైజు కంటే అధిక కొలతలున్న బ్యాట్లను అంపైర్లు అనుమతించట్లేదు. ప్రతి మ్యాచ్ లో ప్రత్యేక గేజ్ తో బ్యాటు కొలతలు చూస్తున్నారు. గత సీజన్ లోనూ ఈ పద్ధతిని అనుసరించినా.. మ్యాచ్ కు ఒకరోజు ముందు ఫోర్త్ అంపైర్ ఎవరైనా ఆటగాడికి చెందిన ఒక బ్యాటును పరిశీలించేవారు. అయితే సదరు ఆటగాడు మరుసటి రోజు మ్యాచ్లోకి ఇంకో బ్యాటుతో వెళ్లినా గుర్తించేవారు కాదు. దీనిపై ఐపీఎల్ ప్రారంభానికి ముందు మ్యాచ్ అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో మ్యాచ్ లో బ్యాట్ల పరిశీలన నిబంధనకు ఈనెల 13న ఐపీఎల్ పాలక మండలి ఆమోదం తెలిపింది. అప్పట్నుంచి ముందు రోజు ఎవరో ఒకరిది కాకుండా మ్యాచ్లో ప్రతి ఒక్క బ్యాటును పరిశీలిస్తున్నారు.



# ప్రపంచ బిలియరడ్స్ ఛాంప్ కొఠారి

భారత స్టార్ క్యూయిస్ట్ సౌరవ్ కొఠారి ప్రపంచ బిలియరడ్స్ ఛాంపియన్ షిప్(టైమ్డ్ ఫార్మాట్)ను సొంతం చేసుకున్నాడు. ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో సహచర ఆటగాడు మాజీ ఛాంపియన్ పంకజ్ అడ్వాణీకి అతడు షాకిచ్చాడు. గురువారం కొఠారి 725-480 పాయింట్లతో పంకజ్ పై విజయం సాధించాడు. అసాధారణంగా ఆడిన అతడు తొలి అరగంట ఆటలోనే 325 పాయింట్ల బ్రేక్ తో పంకజ్ పై ఆధిపత్యం ప్రదర్శించాడు. మూడు గంటల ఫైనల్లో సౌరవ్ ను అందుకునేందుకు పంకజ్ గట్టిగానే పోరాడాడు. ఒక దశలో 50 పాయింట్ల దూరంలో నిలిచాడు. కానీ కీలక సమయంలో దూకుడు ప్రదర్శించిన సౌరవ్ ఆధిక్యాన్ని క్రమంగా పెంచుకున్నాడు. ఆఖరికి స్పష్టమైన ఆధిక్యం సాధించాడు. సౌరవ్ తండ్రి మనోజ్ కొఠారి కూడా టైమ్డ్ ఫార్మాట్ లో 1990లో ప్రపంచ ఛాంపియన్ గా నిలిచాడు. నాన్న బాటలో నడిచిన సౌరవ్ 35 ఏళ్ల విరామం తర్వాత అతడు సాధించిన ఘనత అందుకోవడం విశేషం. ఈ టోర్నీలో తొలి మూడు స్థానాల్లో భారత ఆటగాళ్లే నిలవడం విశేషం. ధ్రువ్ సిత్వాల మూడో స్థానం దక్కించుకున్నాడు.

# బాలయ్య నెక్స్ట్ ఈ దర్శకునితోనే

ప్రస్తుతం నందమూరి నటసింహం బాలయ్య వరుస బ్లాక్ బస్టర్ హిట్స్ తో దూసుకెళ్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇపుడు దర్శకుడు బోయపాటి శ్రీనుతో అఖండ 2 లో తాను బిజీగా ఉన్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తవుతుండగా ఈ చిత్రం తర్వాత బాలయ్య ఎవరితో వర్క్ చేయనున్నారు అనేది ఇపుడు కన్ఫర్మ్ అయ్యింది.

తనకి వీర సింహా రెడ్డి లాంటి హిట్ ఇచ్చిన దర్శకుడు గోపీచంద్ మలినేనితో బాలయ్య తన తదుపరి చిత్రాన్ని చేస్తున్నట్టుగా గోపీచంద్ రివీల్ చేశారు. బాలీవుడ్ హంగామాతో మాట్లాడిన గోపీచంద్ ప్రస్తుతం జాట్ సక్సెస్ తో నెక్స్ట్ సినిమాని వెంటనే బాలయ్యతో చేస్తున్నట్టుగా తాను తెలిపాడు. అలాగే ఈ సినిమాని బాలయ్య పుట్టినరోజు కానుకగా ఈ జూన్ 10న అనౌన్స్ చేస్తున్నట్టుగా తాను తెలిపారు. సో బాలయ్య నెక్స్ట్ కోసం మరోసారి తన హిట్ దర్శకుడు వర్క్ చేయనున్నాడని చెప్పాలి.





# ఆ రోజులే ఎంతో ప్రత్యేకమంటోంది పూజా హెగ్డే


లేఖల ద్వారా భావోద్వేగాలు పంచుకున్న వెనకటి రోజులే ఎంతో ప్రత్యేకమంటోంది నటి పూజా హెగ్డే. ఆ రోజుల్ని ఇప్పుడు తానెంతో మిస్ అవుతున్నానని తెలిపింది. ప్రస్తుతం ఆమె.. సూర్య కలిసి నటించిన చిత్రం 'రెట్రో'. కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ సినిమా మే 1న థియేటర్లలోకి రానుంది. ఇదొక పీరియాడిక్ యాక్షన్ డ్రామా కథతో రూపొందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ''1980-90ల కాలం రోజుల్ని గుర్తు చేసుకుంటే ఇప్పుడు మీరేం మిస్ అయ్యారని ఫీలవుతున్నార''ని ప్రశ్నించగా ''లెటర్స్'' అంటూ బదులిచ్చింది.

''వాట్సప్ లేని ఆ రోజులు ఎంతో ప్రత్యేకం. ఎందుకంటే నాకు మెసేజింగ్ చేయాలంటే అసలు నచ్చదు. ఆ రోజుల్లో ఎవరితో మాట్లాడాలన్నా చక్కగా లేఖలు రాసుకునే వాళ్లు. ఆ రోజుల్ని మనం ఇప్పుడు కోల్పోయాం. ఆ రోజుల్లో ఒకరికి ఓ లేఖ రాస్తే.. అవతలి వాళ్లు తిరిగిచ్చే ప్రత్యుత్తరానికి.. ఆ లేఖ కోసం చూసే ఎదురు చూపులకు ఓ విలువ ఉండేది. అలా పేపర్.. పెన్ పట్టుకుని మన భావోద్వేగాలకు అక్షర రూపం ఇవ్వడంలోనే ఓ మ్యాజిక్ ఉంది. అదొక అద్భుతమైన కళ. దాన్ని ఇప్పుడున్న డేటాలా ఎవరూ డిలీట్ చేయలేరు. అవతలి వాళ్ల ఎమోషన్స్ ను లేఖ రూపంలో ఫిజికల్ గా స్పృశించగలుగుతాం. అలాంటి సింపుల్ జీవితాల్ని.. అందులోని అద్భుతమైన క్షణాల్ని ఇప్పుడు మనమంతా కోల్పోయాం. నేనైతే నా జీవితంలో చాలా లేఖలే రాశా'' అని చెప్పుకొచ్చింది పూజ. ఆమె త్వరలో ఓ ప్రేమకథా చిత్రంతో తెలుగులోకి రీఎంట్రీ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఆ చిత్ర వివరాల్ని త్వరలో సదరు నిర్మాణ సంస్థ ప్రకటించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఆమె తమిళంలో 'జన నాయగన్', 'కూలీ', 'కాంచన 4' చిత్రాల్లో నటిస్తోంది.



# బరిలో దిగేది అప్పుడే!

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సినిమా ఇప్పుడు రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమవుతోంది. దీనికోసం మే మూడో వారం నుంచి చిరు రంగంలోకి దిగనున్నారని సమాచారం. ఈ తొలి షెడ్యూల్ హైదరాబాద్ లోనే మొదలు కానున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లుగా ఇప్పటికే పూర్వ నిర్మాణ పనుల్ని వేగవంతం చేసింది చిత్రబృందం. వినోద ప్రధానంగా సాగే ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్ లో చిరంజీవికి జోడీగా ఇద్దరు నాయికలు కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఒక సీనియర్ భామతో పాటు ఓ యువ నాయికను రంగంలోకి దించే అవకాశముంది. ఇక మరోవైపు ఈ సినిమాలో చిరుతో పాటు వెంకటేశ్ తెర పంచుకోనుండటం దాదాపు ఖాయమైనట్లు తెలిసింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందించనుండగా.. సమీర్ రెడ్డి ఛాయా గ్రాహకుడిగా వ్యవహరించనున్నారు.



# దక్షిణాది చిత్రాలు ఇప్పటికే దాన్ని అనుసరిస్తున్నాయి: మంచు విష్ణు

దక్షిణాది చిత్రాలను హిందీ ప్రేక్షకులు ఆదరిస్తున్నారని, నటీనటులు అందరూ తమ చిత్రాల కోసం హిందీలోనూ ప్రచారం చేయడం గౌరవంగా భావించాలని కథానాయకుడు మంచు విష్ణు అభిప్రాయపడ్డారు. ఆయన కీలక పాత్రలో ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కన్నప్ప'. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ప్రచారంలో భాగంగా మంచు విష్ణు పలు విషయాలపై మాట్లాడారు. ముఖ్యంగా దక్షిణాది చిత్రాలను హిందీ ప్రేక్షకులకు మరింత చేరువ చేయాలన్నారు. ''ఉత్తరాది నుంచి వచ్చే వసూళ్లను మనం గౌరవించాలి. ముఖ్యంగా హిందీ ప్రేక్షకులు మన సినిమాలపై ఎంతో ప్రేమ కనబరుస్తున్నారు. ఆ విషయాన్ని మనం తప్పకుండా గుర్తించాలి. అన్ని వర్గాలు, భాషల వారు చూసేలా మనం సినిమా తీస్తున్నప్పుడు హిందీ ప్రేక్షకుల వద్దకు కూడా వెళ్లి మన సినిమాను ప్రచారం చేసుకోవాలి. అది వాళ్లకు మనం ఇచ్చే గౌరవం'' అని అన్నారు. హిందీతో పాటు ఇతర భాషల నటీనటులతో కలిసి సినిమా చేయడంపైనా మంచు విష్ణు మాట్లాడారు. ''వాళ్లంతా గొప్ప నటులు. వాళ్లకున్న భారీ అభిమానగణం, ఛరిష్మా, స్టార్ పవర్ మా సినిమాకు అవసరమైంది. అందుకే 'కన్నప్ప' నా గత చిత్రాల మార్కెట్ కన్నా మించిపోవడమే కాదు, భారీ బడ్జెట్ తో రూపొందించాం. ఈ సినిమాను ఎక్కువ మంది ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాలన్నది మా ఆలోచన. ప్రజలెప్పుడూ వీళ్లు దక్షిణాది, వాళ్లు ఉత్తరాది నటులు అని చూడరు. అందరూ మన నటులే అనుకుంటారు''

''దర్శక-నిర్మాతలు మూలాలకు వెళ్లి కథా రచనపై దృష్టిపెట్టాలి. అప్పుడే అందులోని భావోద్వేగాలను కథలోకి తీసుకురాగలరు. ప్రస్తుతం దక్షిణాది చిత్రాలు ఇదే పంథాను అనుసరిస్తున్నాయి. అదే సమయంలో విజయాల రేటు మాత్రం అన్ని ఇండస్ట్రీల్లోనూ ఒకేలా ఉంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ ఇండస్ట్రీలను బాలీవుడ్కు వ్యతిరేకంగా చూపించడం సరైనది కాదని నా అభిప్రాయం. హిందీ చిత్ర పరిశ్రమ విషయంలో మీడియా కొంత కఠినంగా వ్యవహరిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. మా 'కన్నప్ప' ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. ఎన్నో అద్భుతమైన కథలు ఇంకా ఉన్నాయి. అవి కార్యరూపం దాల్చే విషయమై బాలీవుడ్ స్టార్స్తో ఇప్పటికే చర్చలు కొనసాగిస్తున్నాం'' అని మంచు విష్ణు అన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.